

జిల్లా సమస్యలపై గళమెత్తిన ఎమ్మెల్యేలు



జిల్లాకు చెందిన ముగ్గురు ఎమ్మెల్యేలు అసెంబ్లీలో గళమెత్తారు. తమ నియోజకవర్గాల సమస్యలపై శాసనసభ బడ్జెట్ సమావేశాల్లో తొలిసారిగా తమ వాణిని విన్పించారు.

- చిత్తూరు సిటీ, ఆంధ్రజ్యోతి

అసెంబ్లీ వాయిస్



అడవిపల్లి ప్రాజెక్టు పనులు పూర్తి చేయాలి

వైసీపీ ప్రభుత్వ పాలనలో అన్ని రకాలుగా నష్టపోయిన రాష్ట్రాన్ని అభివృద్ధి వైపు మళ్లించేందుకు సీఎం చంద్రబాబు చేస్తున్న కృషికి అభినందనలు.ఆయన నాయకత్వంలో అమరావతి, పోలవరం పనులు మళ్లీ ఊపందుకున్నాయి.నిర్వీర్యమైన అన్ని వ్యవస్థలూ గాడిన పడుతున్నాయి.చిత్తూరు నగర తాగునీటి సమస్య శాశ్వత పరిష్కారానికి గత టీడీపీ ప్రభుత్వంలో ప్రారంభించిన అడవిపల్లి రిజర్వాయర్ పనులు పూర్తి చేయాలని కోరుతున్నా.అలాగే మా నియోజకవర్గంలో అభివృద్ధి పనులకు ప్రత్యేక నిధులు కేటాయించాలి.

- గురజాల జగన్మోహన్,చిత్తూరు



అభివృద్ధికి నోచుకోని పూతలపట్టుకు నిధులివ్వండి

శాస్త్రీయ పద్ధతిలో బడ్జెట్ కేటాయింపులు జరిగాయి. ముఖ్యంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఓబీసీలతో పాటు మహిళాభివృద్ధికి ప్రాధాన్యత ఇచ్చినందుకు,నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడంకోసం స్కిల్ డెవలప్‌మెంట్‌కు ప్రత్యేక నిధులు కేటాయించినందుకు సీఎం చంద్రబాబుకు ప్రత్యేక ధన్యవాదాలు. చాలా సంవత్సరాలుగా అభివృద్ధికి నోచుకోని పూతలపట్టు అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయించాలి.

-మురళీమోహన్, పూతలపట్టు



ఇండస్ట్రియల్ కారిడార్‌కు సహకరించాలి

గంగాధర నెల్లూరు నియోజకవర్గంలో ఇండస్ట్రియల్ కారిడార్‌కు నిధులు కేటాయించాలి.నియోజకవర్గమంతా కొండలు, గుట్టలమయం. ఇక్కడ చదువుకున్న యువతలో 80శాతం బెంగళూరు, 10 శాతం చెన్నై, 10శాతం హైదరాబాదుకు ఉపాధికోసం వెళ్లిపోతున్నారు.ఇండస్ట్రియల్ కారిడార్‌కు కావలసిన వసతులు మా నియోజకవర్గంలో ఉన్నాయి. ఆస్పత్రుల్లో ఆపరేషన్ థియేటర్లతో పాటు ల్యాబ్, మౌలిక వసతుల కల్పనకు చర్యలు తీసుకోవాలి.చిత్తూరు - తచ్చూరు హైవే నిర్మాణ పనులు పూర్తిచేయాలి.

- థామస్,గంగాధర నెల్లూరు



ప్రజారోగ్యంపై ప్రభుత్వ దృష్టి



● 18 ఏళ్లు పైబడిన వారందరికీ నేటినుంచి క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు

చిత్తూరు రూరల్, నవంబరు 13(ఆంధ్రజ్యోతి):సమాజంలో క్యాన్సర్ చాపకింద నీరులా విస్తరిస్తోంది. వ్యాధి బారిన పడుతున్న బాధితుల సంఖ్య పెరిగిపోతోంది. దాన్ని తొలి దశలోనే గుర్తించి వైద్య సేవలందిస్తే నయం చేయవచ్చని ప్రభుత్వం భావించింది. అందులో భాగంగానే జాతీయ ఆరోగ్య మిషన్, రాష్ట్ర ప్రభుత్వం ఈ నెల 14న యూనివర్సల్ కామన్ క్యాన్సర్ స్క్రీనింగ్ కార్యక్రమాన్ని ప్రారంభించనుంది. నోటి, రొమ్ము, గర్భాశయ ముఖద్వార క్యాన్సర్లను గుర్తించేందుకు స్క్రీనింగ్ చేయనున్నారు. అందుకు ఒక వైద్యాధికారితోపాటు ఆరోగ్య సిబ్బంది ఇంటింటికీ వెళ్లి 18 ఏళ్లు పైబడిన వారందరికీ ఆరోగ్య పరీక్షలు చేస్తారు. వ్యాధి లక్షణాలున్న వారిని గుర్తించి సకాలంలో మెరుగైన వైద్యసేవలు అందించనున్నారు.

● రోజుకు 5 కుటుంబాలు

జిల్లాలో గ్రామీణ ప్రాంతాల్లో 52, అర్బన్ ఏరియాల్లో 15 పీహెచ్‌సీలు, హెల్త్ అండ్ వెల్‌నెస్ క్లినిక్స్ 464 ఉన్నాయి. ఒక్కో పీహెచ్‌సీ పరిధిలో రోజుకు ఒక ఏఎన్ఎం, ఎంఎల్‌హెచ్‌పీ, ఆశా కార్యకర్త ఐదు ఇళ్లకు వెళ్లి స్క్రీనింగ్ చేస్తారు. 18 సంవత్సరాలు పైబడిన వారందరికీ రక్తపోటు, మధుమేహం, హెచ్‌బీ, ఆర్‌బీఎస్ వంటి పరీక్షలు చేస్తారు.ఏవైనా ఆరోగ్య సమస్యలుంటే వివరాలు నమోదు చేస్తారు. నోటి, రొమ్ము క్యాన్సర్‌కు సంబంధించి ప్రాథమిక పరీక్షలు చేస్తారు. 30 ఏళ్లు పైబడిన మహిళలకు గర్భాశయ ముఖద్వార (సర్వైకల్ క్యాన్సర్)కు సంబంధించి ప్రాథమిక పరీక్ష చేస్తారు. వ్యాధి లక్షణాలున్న వారిని గుర్తించి వివరాలను కమ్యూనిటీ బేస్డ్ అసెస్మెంట్ చెక్‌లిస్ట్(సీబాక్) యాప్‌లో నమోదు చేస్తారు. ఈ పరీక్షలు నిర్వహించేందుకు అవసరమైన వైద్య సామగ్రిని ఇప్పటికే కేటాయించారు.

● వైద్య సేవలు ఇలా

రొమ్ము, గర్భాశయ ముఖద్వార, నోటి క్యాన్సర్ లక్షణాలున్న వారిని గుర్తిస్తే మొదట జిల్లా ఆస్పత్రి, ఏరియా, సీహెచ్‌సీలో ఏర్పాటు చేసిన నోడల్ అధికారులు పరీక్షలు నిర్వహిస్తారు. అక్కడే నయం చేయగలిగే స్థాయిలో ఉంటే వైద్యం అందిస్తారు, క్యాన్సర్ తీవ్రత ఎక్కువుంటే తిరుపతిలోని రుయా స్పత్రికి సిఫార్సు చేసి అక్కడే ఉచితంగా వైద్యం అందిస్తారు. ఈ ఆస్పత్రితో పాటు ఎన్టీఆర్ వైద్యసేవ అమలవుతున్న అస్పత్రులకు పంపుతారు. అక్కడ ఉచితంగా వైద్యసేవలు అందించేందుకు చర్యలు తీసుకుంటారు. ఇందులో ప్రజల ఆహారపు అలవాట్ల నుంచి వారి మానసికస్థితి, అలవాట్లు, ఏం తింటారు, ఏం తాగుతారు, వారి స్థితిగతులేంటి, ఏ ఆహారం తీసుకుంటారనే విషయాలను కూడా ఈ స్క్రీనింగ్ కార్యక్రమంలో పొందుపరచనున్నారు. ప్రభుత్వం ముందు చూపుతో ప్రారంభించిన ఈ కార్యక్రమాన్ని వైద్యఆరోగ్య శాఖ సక్రమంగా నిర్వహిస్తే జిల్లాలో క్యాన్సర్‌ను తరిమికొట్టొచ్చు.

స్క్రీనింగ్ పరీక్షలకు సర్వం సిద్ధం



స్క్రీనింగ్ చేసేందుకు బృందాలన్నింటినీ సిద్ధం చేశాం. ఇప్పటికే వీరికి ప్రత్యేక శిక్షణ ఇచ్చాం. పరీక్షలకు అవసరమైన సామగ్రిని సంబంధిత పీహెచ్‌సీలకు పంపించాం. 6 నుంచి 8 నెలల్లోపు స్క్రీనింగ్ పూర్తి చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా నిర్ణయించింది.

- ప్రభావతిదేవి, డీఎంహెచ్‌వో

ఏఎస్పీగా రాజశేఖర రాజు



చిత్తూరు అర్బన్, నవంబరు 13(ఆంధ్రప్రదేశ్): జిల్లా అడిషనల్ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీసు (ఆపరేషన్)గా రాజశేఖర రాజు నియమితులయ్యారు. అన్నమయ్య జిల్లా అడ్మిన్ ఏఎస్పీగా విధులు నిర్వహిస్తూ బదిలీపై చిత్తూరుకు రానున్నారు. శుక్రవారం ఈయన బాధ్యతలు స్వీకరించనున్నారు.

సీకే బాబుపై దాడి కేసు కొట్టివేత

చిత్తూరు లీగల్, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): చిత్తూరు మాజీ ఎమ్మెల్యే సీకే జయచంద్రారెడ్డి అలియాస్ సీకే బాబుపై జరిగిన దాడి కేసును బుధవారం హైకోర్టు కొట్టివేసింది.2007 డిసెంబర్ 31వ తేదీన తన అనుచరులతో కలిసి కట్టమంచి వద్ద సీకే బాబు కారులో వెళుతుండగా బాంబు పేలింది. ఈ సంఘటనలో ఒకరు మృతి చెందగా, సీకే బాబుతో పాటు మరో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. దీనిపై చిత్తూరు పోలీసులు చింటూ అలియాస్ చంద్రశేఖర్‌తోపాటు మరో 16 మందిపై కేసు నమోదు చేసి నిందితులను రిమాండ్‌కు తరలించారు. ఈ కేసు చిత్తూరు 9వ అదనపు జిల్లా కోర్టులో విచారణ జరగగా, అప్పట్లో చింటూపై నేరం రుజువు కావడంతో న్యాయమూర్తి అతడికి జీవిత ఖైదు విధిస్తూ తీర్పు చెప్పారు. దీనిపై చింటూ హైకోర్టుకు అప్పీల్‌కు వెళ్లగా పూర్వాపరాలు పరిశీలించిన రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం కింద కోర్టు విధించిన జీవిత ఖైదు శిక్షను కొట్టివేస్తూ బుధవారం తీర్పుచెప్పింది.

19మంది సీనియర్ అసిస్టెంట్లకు పదోన్నతి

చిత్తూరు రూరల్, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): జిల్లా పరిషత్ పరిధిలో సీనియర్ అసిస్టెంట్లుగా పనిచేస్తున్న 19 మందికి ఏవోలుగా పదోన్నతి కల్పిస్తూ సీఈవో రవికుమార్ నాయుడు బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. మిగిలిన క్యాడర్లకు రెండు రోజుల్లో పదోన్నతులు పూర్తి చేయనున్నట్లు ఆయన తెలిపారు.

గంజాయితో పట్టుబడిన డిగ్రీ విద్యార్థి

చిత్తూరు అర్బన్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): తల్లిదండ్రులు ఇచ్చే ప్యాకెట్‌మనీ సరిపోలేదంటూ గంజాయి విక్రయాలకు దిగజారిపోయాడో విద్యార్థి. రెండో పట్టణ సీఐ నెట్టికంఠయ్య కథనం మేరకు... చిత్తూరు నగరం బాలాజీ కాలనీకి చెందిన రవితేజ(22) డిగ్రీ ఫైనలియర్ చదువుకుంటున్నాడు. ఇతడి తల్లిదండ్రులు ఓ ప్రైవేటు పాఠశాలలో టీచర్లుగా పనిచేస్తున్నారు. జల్సాలకు అలవాటుపడ్డ రవితేజకు తల్లిదండ్రులు ఇచ్చే ప్యాకెట్‌మనీ సరిపోలేదు.దీంతో తెలిసిన వారి వద్ద గంజాయిని తీసుకుని మారు బేరానికి విక్రయించేవాడు. ఈ నేపథ్యంలో ఇరువారం సమీపంలోని గుట్ట ప్రాంతంలో రెండు కిలోల గంజాయిని దాచిపెట్టి విక్రయించడానికి ప్రయత్నాలు చేస్తుండగా పోలీసులు పట్టుకున్నారు. ఆ రెండు కిలోల గంజాయిని సీజ్ చేసి రవితేజను రిమాండ్‌కు తరలించారు.

ఆ 105ఎకరాలు ఎవరివి?

-7లో

● మావంటే మావంటున్న అటవీ, రెవెన్యూ శాఖలు
● ముద్దురామాపురంలో వింత పరిస్థితి



ముద్దురామాపురంలో ప్రభుత్వం నిర్మించిన సీసీరోడ్లు

గురి పెట్టాలంతే



చిత్తూరు సెంట్రల్, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): చిత్తూరు పోలీసు శిక్షణ కేంద్రంలో బుధవారం ఎన్‌సీసీ క్యాడెట్లకు రైఫిల్ షూటింగ్‌పై శిక్షణ ఇచ్చారు. యాన్యువల్ ట్రైనింగ్ క్యాంపులో భాగంగా జరిగిన ఈ కార్యక్రమంలో క్యాంపు కమాండెంట్ కల్నల్ నోయల్ వివేక్ మాట్లాడుతూ రైఫిల్ షూటింగ్‌లో ఏకాగ్రత చాలా ముఖ్యమన్నారు.ఎన్‌సీసీ అధికారులు ప్రసాద్‌రెడ్డి, బాలాజీ, ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

నిజంగానే 'ప్రజా'దర్బార్!



మహిళను కూర్చోబెట్టి, నీళ్లిచ్చి మరీ సమస్యను వినడానికి ఉద్యుక్తులైన కడా పీడీ వికాస్ మర్మత్

'నీకేం కావాలి పెద్దమ్మా? పెద్దమ్మకు కుర్చీ వేసి కూర్చోబెట్టండి. చాలాదూరంనుంచి నడిచివచ్చినట్లుంది, నీళ్లివ్వండి.

- కడా పీడీ వికాస్ మర్మత్ బాధ్యతతో కూడిన ఆదరణ.

మన ఊరికి అధికారులంతా తరలివచ్చారమ్మా. మీకేం కావాలో, ఏయే అవసరాలు తీరాలో అడగండి. మళ్లీ మమ్మల్నంటే మేం ఏమీ చేయలేం. పీడీ సార్ మీ అన్ని సమస్యలు తీర్చడానికే ఇక్కడకు వచ్చారు.

- ఆర్టీసీ వీసీ పీఎస్.మునిరత్నం సహ టీడీపీ నేతల ఆదరణ.

వినతులు విని, స్వీకరించి, వీలైతే అక్కడికక్కడే పరిష్కారాలు చెప్పే వివిధ ప్రభుత్వ శాఖలకు చెందిన అధికార యంత్రాంగం.

కుప్పం మండలం కంగుందిలో బుధవారం కడా ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన ప్రజా దర్బార్ దృశ్యాలివి. మన పంచాయతీ వద్దకు మన ప్రభుత్వం అనే ట్యాగ్‌తో నిర్వహించిన ప్రజా దర్బార్, ఒకనాటి రచ్చబండ గ్రామ సభలను తలపించింది. పచ్చటి ప్రకృతి వొడిలో, షామియానాల కింద వరుసలుగా వేసిన కుర్చీలు. ఆ కుర్చీలలోనే కాదు, షామియానాల వెలుపల కూడా అక్కడక్కడా నిబడి, కూర్చుని గ్రామీణులు. ఒక్కరొక్కరుగా ప్రజలనుంచి సమస్యలు విని, శ్రద్ధగా నోట్ చేసుకుంటున్న కడా పీడీ వికాస్ మర్మత్, ఆర్టీసీ వైస్ ఛైర్మన్, కుప్పం నియోజకవర్గ టీడీపీ ఇన్‌ఛార్జి పీఎస్.మునిరత్నం, ఇతర అధికార పార్టీ నేతలు, ప్రజా ప్రతినిధులు. ప్రజలు పేర్కొంటున్న వ్యక్తిగత, సామాజిక సమస్యల వివరాలను అడిగి తెలుసుకుంటూ అక్కరగా ఫైళ్లలోకి ఎక్కిస్తున్న వివిధ ప్రభుత్వ శాఖల యంత్రాంగం. నిజంగానే ఆ వాతావరణం నిజమైన 'ప్రజా' దర్బార్‌లా భాసిల్లింది. వారానికి రెండుసార్లు కడా పీడీ, కలెక్టరు మండల సచివాలయంలోని నాలుగు గోడల మధ్య కూర్చుని నిర్వహిస్తున్న ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు బిక్కుబిక్కుమంటూ వచ్చి వంగివంగి దండాలు పెట్టి బిడియంగా నిలుచుకునే గ్రామీణులు అక్కడ నిటారుగా నిలుచుని మైక్ చేతపట్టి, నిర్భయంగా తమ సమస్యలు తెలియజెప్పారు.అధికారులు, నాయకులు సైతం వారి సమస్యలు సావధానంగా విని, వీలైతే అక్కడికక్కడే పరిష్కారాలు చూపారు. కానిపక్షంలో ఆయా సమస్యలను నోట్ చేసుకుని నిర్దేశిత గడువులోగా తీరుస్తామని రశీదుతో కూడిన హామీలను ఇచ్చారు.మొత్తం 117సమస్యలపై అర్జీలు అందిన ఈ ప్రజా దర్బార్‌లో టీడీపీ నియోజకవర్గ విస్తరణ కమిటీ అధ్యక్షుడు డాక్టర్ బీఆర్.సురేశ్‌బాబు, మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులు, టీడీపీ కుప్పం మండల అధ్యక్షుడు ప్రేమ్‌కుమార్, చెక్కునత్తం మణి, వివిధ ప్రభుత్వ విభాగాలకు చెందిన అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

- కుప్పం, ఆంధ్రజ్యోతి



ప్రకృతి ఒడిలో చెట్ల కింద గ్రామీణులు

ఆహారం కోసం ఎదురుచూస్తూ..



వాహనాల వైపు చూస్తూ నిలబడి ఉన్న దుప్పులు

● ఘాట్ రోడ్లపైకి వచ్చేస్తున్న దుప్పులు, జింకలు

వాహనాల్లో వెళ్లే వారు ఏమైనా పెట్టకపోతారా అన్నట్టుగా తిరుమల ఘాట్‌రోడ్డులో కొన్ని దుప్పులు, జింకలు ఎదురుచూస్తూ గడిపేస్తున్నాయి. సాధారణంగా వైల్డ్‌లైఫ్ చట్టాల ప్రకారం అడవి జంతువులకు మనుషులు ఫీడింగ్ ఇవ్వడం నిషేధం. ఇందులో భాగంగానే అలిపిరి మార్గంలో వచ్చే మార్గంలోని పార్కులో ఉన్న జింకలను కూడా టీటీడీ అధికారులు మూడేళ్ల క్రితమే అడవిలోకి విడిచిపెట్టారు. దీంతో కాలినడకన వచ్చే భక్తులు ఆహారం అందించే విధానం తగ్గింది. అయితే శ్రీవారి దర్శనం ముగించుకుని తిరుగు ప్రయాణమయ్యే భక్తులు జింకలను, దుప్పులను దగ్గరగా చూసేందుకు వాహనాలు ఆపి మరీ తమ వద్దనున్న వివిధ రకాల ఆహార పదార్థాలను పెడుతుంటారు. ఇలా చాలా వరకు దుప్పులు, జింకలు భక్తులు ఇచ్చే ఆహారం కోసం అలవాటు పడ్డాయి. దీంతో జింకలపార్కు సమీపంలో ఉన్న రోడ్డుపైకి తరచూ జింకలు, దుప్పులు వచ్చేస్తున్నాయి. భక్తులు పెట్టే ఆహార పదార్థాల కోసం ఎదురు చూస్తూ కనిపిస్తున్నాయి. 'అడవి జంతువులకు ఫీడింగ్ ఇవ్వకండి' అంటూ బోర్డులు ఏర్పాటు చేసిన క్రమంలో చాలా మంది వెళ్లిపోతున్నారు. దీంతో జంతువులు మాత్రం రోడ్డు సమీపంలోనే ఉండిపోతున్నాయి. రోడ్డుకి సమీపానికి వస్తున్న ఈ జంతువులకు ఇబ్బంది లేకుండా ఫారెస్ట్ అధికారులు చర్యలు తీసుకోవాలని కొందరు భక్తులు అభిప్రాయపడుతున్నారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి



తిరుమలలో కేజ్రీవాల్

ఆమ్‌ఆద్మీ పార్టీ అధినేత, ఢిల్లీ మాజీ సీఎం అరవింద్ కేజ్రీవాల్ శ్రీవారి దర్శనార్థం బుధవారం రాత్రి తిరుమల చేరుకున్నారు. శ్రీకృష్ణ అతిథి గృహం వద్ద ఆయనకు రిసెప్షన్ సిబ్బంది, పార్టీ నేతలు స్వాగతం పలికారు. గురువారం ఉదయం ఆయన శ్రీవారిని దర్శించుకోనున్నారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి

▌నేడు ప్రపంచ డయాబెటిక్ డే



7 నెలలు.. 32 వేల మంది



'అడ్డంకులను బద్దలు కొట్టడం... అంతరాలను పూడ్చడం' ప్రపంచ మధుమేహ దినోత్సవం-2024 సందర్భంగా ప్రపంచ ఆరోగ్యసంస్థ నినాద మిది. డయాబెటిస్‌తో బాధపడుతున్న ప్రతి ఒక్కరికీ సమగ్రమైన, సరసమైన, నాణ్యమైన చికిత్స ఇవ్వాలనేదే దీని సారాంశం. కాగా, జిల్లాలో రోజు రోజుకు మధుమేహ బాధితులు పెరిగిపోతున్నారు గత ఏడు నెలల్లో 32,477 మంది కొత్తగా మధుమేహంతో బాధపడుతున్నట్టు అధికారిక లెక్క. దీంతో సంబంధం లేకుండా మరో పది వేల మంది ఉంటారని వైద్య వర్గాలు చెబుతున్నాయి. మారిన జీవన విధానం, ఆహారపు అలవాట్లే దీనికి కారణంగా తెలుస్తోంది.

- తిరుపతి, ఆంధ్రజ్యోతి

● తిరుపతి జిల్లాలో పెరుగుతున్న మధుమేహ బాధితులు ● అనధికారికంగా మరో పది వేలమంది ఉండొచ్చని అంచనా



డయాబెటిక్ పుట్‌ను అశ్రద్ధ చేయొద్దు

మధుమేహ వ్యాధి అదుపులో లేని వారు పెరిఫెరల్ న్యూరోపతికి గురవుతుంటారు. కాళ్లలో సన్నటి నరాలు దెబ్బతిని రక్తప్రసరణ తగ్గి చిన్న అల్సర్ వస్తుంది. చెప్పుల వల్ల, చెప్పులు లేకుండా నడవడం వలన చిన్న దెబ్బలు ఏర్పడి పెద్దపుండులాగా మారిపోతుంటాయి. న్యూరోపతి వలన స్పర్శ తెలియకుండా ఎండాకాలంలో కాళ్ల వేడికి బొబ్బలు వచ్చి అల్సర్‌గా మారుతుంది. తొలిదశలో చికిత్స చేసుకోకుండా నిర్లక్ష్యం చేస్తే ఎముకలు దెబ్బతినడం వలన వేలు తీసేసే పరిస్థితి వస్తుంది. సెప్టిక్ ఎక్కువైనప్పుడు కాళ్లుకూడా తీసేయాల్సి ఉంటుంది. చెప్పులు మెత్తగా ఉండేవి వాడాలి. చెప్పులు లేకుండా బయట నడవకుండా ఉండడం మంచిది. షుగర్ వ్యాధి ఉన్నవాళ్లలో 6శాతం మంది వరకు డయాబెటిక్ ఫుట్‌తో బాధపడుతుంటారు. కాళ్లలో రక్తప్రసరణ సరిగ్గా ఉందోలేదో చూసుకోవాలి. డాప్లర్ అల్ట్రా సౌండ్ సులభంగా చేసుకునే మార్గాలు ఓపీలో అందుబాటులోనే వచ్చాయి. అదే డ్రెస్సింగ్ మెటీరియల్‌కూడా స్టైరైల్, నాణ్యమైనవి ఉన్నాయి. అందువల్ల కాళ్లకు గాయాలు ఉన్నట్టుగుర్తించిన వెంటనే తగిన చికిత్స తీసుకుంటే ఉపశమనం పొందవచ్చు.

- డాక్టర్ హరినాథ రెడ్డి, సీనియర్ జనరల్ సర్జన్, హర్షిత ఆస్పత్రి



సరైన ఆహారం, నడక తప్పనిసరి

మధుమేహం బయటపడ్డ నాటినుంచే మందులు మొదలుపెట్టడం తప్పనిసరి. ఇంకోసారి పరీక్ష చేసి చూద్దామంటూ తాత్సారం చేయరాదు. మందులతో పాటు ఆహార వ్యాయామ నియమాలూ పాటించాలి. మన దగ్గర మధుమేహం ఆలస్యంగా బయటపడుతుండటం, గుర్తించినప్పటి నుంచే చాలామందిలో ఏదో ఒక సమస్య కనిపిస్తోంది. జెనిటిక్ (కుటుంబ చరిత్ర), జీవనశైలిలో మార్పుల వలన మధుమేహానికి గురవుతున్నారు. రోజుకు 5వేల నుంచి 10వేల అడుగులు తప్పకుండా నడవాలి. తక్కువ కొవ్వు, తక్కువ పిండిపదార్థాలు, అధిక ప్రొటీన్, ఫైబర్ ఉన్న ఆహారాన్ని తీసుకోవాలి. పోషకాలు పుష్కలంగా ఉండే ఆహారం తీసుకోవడం అందరికీ చాలా ముఖ్యం. డయాబెటిస్ ఉన్నవారు ఈ విషయంలో మరింత జాగ్రత్తలు తీసుకోవాలి. షుగర్ తక్కువగా ఉండే పండ్లు, బీన్స్, పప్పుధాన్యాలు, నట్స్, సీడ్స్‌లో ఫైబర్ ఎక్కువగా ఉంటుంది. ఇన్సులిన్ సెన్సిటివిటీని విటమిన్ డీ మెరుగుపరుస్తుంది. గుడ్లు, ఫ్యాటీఫిష్, ఫోర్టిఫైడ్ ఆహారాల్లో విటమిన్ డీ ఉంటుంది. అదేవిధంగా మెగ్నీషియం, జింక్, పొటాషియం, క్రోమియం కూడా షుగర్ నియంత్రణలో ఉండేందుకు తోడ్పడుతుంది. ఆకుకూరలు, నట్స్, కూరగాయలు, సీడ్స్, ధాన్యాల్లో మెగ్నీషియం పుష్కలంగా ఉంటుంది.

- డాక్టర్ దుర్గాప్రసాద్, డయాబెటాలజిస్ట్, గాయత్రి ఆస్పత్రి



బహుమతులు అందుకున్న అమరరాజా సంస్థకు చెందిన 12 బృందాలు

'అమరరాజా'కు 12 బంగారు పతకాలు

రేణిగుంట, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): అమరరాజా సంస్థ అంతర్జాతీయ స్థాయిలో 12 బంగారు పతకాలను గెలుచుకుంది. బుధవారం శ్రీలంక రాజధాని కొలంబోలో జరిగిన 49వ అంతర్జాతీయ క్వాలిటీ కంట్రోల్ సర్కిల్ పోటీల్లో 14 దేశాల నుంచి 800 బృందాలు.. 5వేల మంది సభ్యులు పాల్గొన్నారు. ఈ పోటీల్లో అమరరాజా సంస్థ లీడ్ యాసిడ్ బ్యాటరీ తయారీ, పవర్ కన్వర్షన్, ఉత్పత్తులు, ఇంజనీరింగ్, ప్లాస్టిక్, ఎలక్ట్రానిక్స్, ఇన్ఫ్రాస్ట్రక్చర్, ఇండస్ట్రియల్ సర్వీసెస్, ఆహార ఉత్పత్తులు వంటి వివిధ రంగాల్లో 12 బృందాలు 12 బంగారు పతకాలు సాధించారు. ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ హర్షవర్ధన్ గౌరినేని మాట్లాడుతూ... ఉమ్మడి లక్ష్యం దిశగా కలిసికట్టుగా పనిచేసినపుడే పూర్తిస్థాయి విజయాలు అందుకుంటామని దీనిని నిరంతరం నిరూపిస్తున్నామన్నారు. అంతర్జాతీయ స్థాయిలో పతకాలు సాధించడంపై చీఫ్ ఆపరేషన్స్ ఆఫీసర్ నరసింహులునాయుడు హర్షం వ్యక్తం చేశారు. తాము పాటిస్తున్న నాణ్యతా ప్రమాణాలకు ఈ విజయాలు నిదర్శనమని అమరరాజా సంస్థ పేర్కొంది.

గర్భిణులకు మెరుగైన వైద్యం అందించండి

ప్రసూతి ఆస్పత్రిలో అధికారులకు కలెక్టర్ దిశానిర్దేశం



అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ వెంకటేశ్వర్

తిరుపతి(వైద్యం), నవంబరు 13(ఆంధ్రజ్యోతి): కాన్పుల కోసం వచ్చే గర్భిణులకు అన్ని సదుపాయాలతో కూడిన మెరుగైన వైద్య సేవలను అందించేందుకు వైద్యాధికారులు కృషి చేయాలని కలెక్టర్ వెంకటేశ్వర్ సూచించారు. తిరుపతిలోని ప్రభుత్వ ప్రసూతి ఆస్పత్రిలో బుధవారం సాయంత్రం ఆస్పత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్ హోదాలో సభ్యులతో కలిసి ఆయన సమావేశాన్ని నిర్వహించారు. ఆస్పత్రి ఆవరణలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని, పార్కింగ్ సమస్య లేకుండా చూడాలని ఆదేశించారు. అలాగే ఆస్పత్రిలో నిత్యం రోగుల సేవలో ఉండే పీజీ వైద్యులకు ఏమైనా సమస్యలు ఉంటే వెంటనే తన దృష్టికి తీసుకువస్తే పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. అనంతరం పలు విషయాలకు సంబంధించి ఆయన కమిటీ సభ్యులతో చర్చించారు. జనరేటర్ మరమ్మతులకు గురవడంతో కాన్పులు, శస్త్ర చికిత్సలు చేసే సమయంలో విద్యుత్తు కోతల వలన ఇబ్బందులు ఎదురవుతున్నాయని ప్రసూతి ఆస్పత్రి సూపరింటెండెంట్ చెప్పారు. కొత్త జనరేటర్ కొనుగోలుకు రూ. 14 లక్షలను కలెక్టర్ విడుదల చేశారు. మరమ్మతులకు గురైన వైద్య పరికరాలను బాగు చేయించాలని, అవసరమైతే కొత్తవి కొనుగోలు చేయడానికి నిధులను విడుదల చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనరు మౌర్య, డీఎంహెచ్‌వో శ్రీహరి, ఎస్వీ వైద్య కళాశాల ప్రిన్సిపల్ చంద్రశేఖరన్, రుయా, ప్రసూతి ఆస్పత్రుల సూపరింటెండెంట్‌లు రవిప్రభు, పార్థసారథిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

భూరక్ష రాళ్లపై పేరు తొలగింపునకు టెండర్ల ఆహ్వానం

తిరుపతి(కలెక్టరేట్), నవంబరు 13(ఆంధ్రజ్యోతి): జిల్లాలో రీసర్వే చేసిన గ్రామాల్లో పాతిన 3,98,872 భూరక్ష రాళ్లపై ఉన్న పేర్లను తొలగించేందుకు టెండర్లు ఆహ్వానిస్తున్నట్లు జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఒక్కొక్క రాయిపై పేరును తొలగించేందుకు రూ.15 చొప్పున టెండర్లు పిలుస్తున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి గల వారు ఈనెల 18వ తేదీలోపు తిరుపతిలోని జిల్లా సర్వే, భూరికార్డుల శాఖ కార్యాలయంలో సంప్రదించాలని కోరారు. మరిన్ని వివరాలకు 7075354941ను సంప్రదించాలని కోరారు.

జిల్లాలో ముసురు

తిరుపతి(కలెక్టరేట్) నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : నైరుతి బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ద్రోణి ప్రభావంతో బుధవారం కూడా జిల్లాలో వర్షం కురిసింది. మధ్యాహ్నం వరకు అడపదడపా వర్షం పడుతూనే ఉంది. దీంతో వాతావరణం చల్లబడింది. బుచ్చినాయుడుకండ్రిగలో 78.8మి.మీ., చిల్లకూరు 75.2, గూడూరు 68.8, డక్కిలి 57.2, రామచంద్రాపురం 54, తడ 51.4, కోట, దొరవారిసత్రం48.2, చిట్టమూరు 46.2, పిచ్చాటూరు 43.4, వడమాలపేట 43, బాలాయపల్లి 40.4, తిరుపతి రూరల్ 36.8, తిరుపతి అర్బన్ 35.4, రేణిగుంట 35.2 వర్షపాతం నమోదైంది.

ట్రాన్స్‌కో అదనపు ఎస్పీగా జనార్ధననాయుడు

తిరుపతి(నేరవిభాగం), నవంబరు 13(ఆంధ్రజ్యోతి): తిరుపతి ట్రాన్స్‌కో అదనపు ఎస్పీగా జనార్దన నాయుడిని నియమిస్తూ ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది.గతంలో ఏసీబీలో పనిచేసిన ఆయన్ను ప్రస్తుతం తిరుపతిట్రాన్స్‌కోలో నియమించారు.

నేటినుంచి ఎంటెక్ స్పాట్ అడ్మిషన్లు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు) నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): పద్మావతి మహిళా యూనివర్సిటీలో గురువారం నుంచి స్పాట్ అడ్మిషన్లు ప్రారంభం కానున్నాయి. ఈ నెల 17వ తేదీ వరకు ఈ ప్రక్రియ కొనసాగనుంది. అర్హతలు, ఖాళీలు, ఫీజు వివరాల కోసం 9573589744లో సంప్రదించాలని వర్సిటీ పీఆర్వో డాక్టర్ శ్రీరజని కోరారు.



భాకరాపేట ఘాట్ రోడ్డులో లోయలో పడిన కారు

లోయలో పడిన కారు

● ఆరుగురికి గాయాలు

చంద్రగిరి, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): భాకరాపేట ఘాట్ రోడ్డులో కారు అదుపు తప్పి లోయలో పడింది. ఈప్రమాదంలో ఆరుగురికి గాయాలయ్యాయి. పోలీసుల కథనం మేరకు బళ్లారి నుంచి మోహన్‌బాబు, భార్య రేణుక అత్త అనంతమ్మ, పిల్లలు కిషోర్ బాబు, వనిత, మోక్షితలు మంగళవారం రాత్రి తిరుమల శ్రీవారి దర్శనానికి కారులో వస్తున్నారు. భాకరాపేట ఘాట్ రోడ్డులోకి రాగానే కారు అదుపు తప్పింది. రోడ్డు పక్క లోయలో పడింది. కారులో ఉన్న ఆరుగురికీ గాయాలయ్యాయి. క్షతగ్రాతులను ఆటోలో తిరుపతి రుయా ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

బాస్కెట్‌బాల్, టేబుల్ టెన్నిస్

విజేతగా ఎస్వీ వ్యవసాయ కళాశాల

ముగిసిన అంతర కళాశాలల క్రీడాపోటీలు

తిరుపతిరూరల్, నవంబరు13(ఆంధ్రజ్యోతి): ఎస్వీ వ్యవసాయ కళాశాల వేదికగా ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ వర్సిటీ పరిధిలోని అంతర కళాశాలల విద్యార్థులకు మూడ్రోజులపాటు నిర్వహించిన మొదటిదశ క్రీడా పోటీలు బుధవారంతో ముగిశాయి. చివరిరోజు జరిగిన బాస్కెట్ బాల్, టేబుల్ టెన్నిస్ క్రీడా పోటీల ఫైనల్స్‌లో ఆతిథ్య ఎస్వీ వ్యవసాయ కళాశాల జట్టు విజేతగా నిలచింది. బాస్కెట్‌బాల్‌లో శ్రీకాకుళం వ్యవసాయ కళాశాలపై, టేబుల్ టెన్నిస్‌లో బాపట్ల వ్యవసాయ కళాశాల జట్టుపై ఎస్వీ వ్యవసాయ కళాశాల జట్టు రాణించి విజేతగా నిలిచిందని ఫిజికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ ప్రొఫెసర్ రవికాంత్ రెడ్డి పేర్కొన్నారు. ముగింపు కార్యక్రమానికి అతిథులుగా హాజరైన అదనపు ఎస్పీ రవిమనోహరాచారి, యూనియన్ బ్యాంక్ రీజనల్ మేనేజర్ జి.రాంప్రసాద్ మాట్లాడుతూ విద్యార్థులు గెలుపోటములను సమానంగా స్వీకరించాలని తెలిపారు. సైబర్‌నేరాలు, మత్తుపదార్థాల పట్ల అప్రమత్తంగా ఉండి ప్రజలను చైతన్యపరచాలని తెలిపారు. కాగా వివిధ క్రీడల్లో విజేతలుగా నిలచిన జట్లకు అవార్డులను ప్రదానం చేశారు. అసోసియేట్ డీన్ డాక్టర్ ఎంవీ రమణ, ప్రొఫెసర్లు, అధ్యాపకులు, పాల్గొన్నారు.



ఎస్వీ వ్యవసాయ కళాశాల జట్టుకు బహుమతులు అందిస్తున్న ఏఎస్పీ రవిమనోహరాచారి

సమస్యలు పరిష్కరించకపోతే సమ్మెబాట తప్పదు



జేసీకి సమ్మె నోటీసు అందజేస్తున్న 108 సిబ్బంది

తిరుపతి(వైద్యం), నవంబరు 13(ఆంధ్రజ్యోతి): ప్రజల ప్రాణాలు నిలబెట్టేందుకు అహర్నిశలు పనిచేస్తున్న 108 సిబ్బంది సమస్యలను ప్రభుత్వం పరిష్కరించకపోతే ఈ నెల 25 నుంచి సమ్మెబాట తప్పదని 108 జిల్లా అధ్యక్షుడు మహేష్ తెలిపాడు. ఈ విషయంపై 108 సిబ్బంది బుధవారం కలెక్టరేట్‌లో జేసీ శుభం బన్సల్‌ను కలిసి సమ్మె నోటీసు అందించారు. 108 సిబ్బందిని ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి ప్రభుత్వ ఉద్యోగులకు ఇచ్చే రాయితీలను కల్పించాలని కోరుతూ గత రెండు రోజులుగా రాష్ట్ర వ్యాప్తంగా వినూత్న కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా 108 జిల్లా అధ్యక్షుడు మహేష్ మాట్లాడుతూ నిరంతరం ప్రజల ప్రాణాలను రక్షించడంలో పనిచేసే తమకు జీతాలు కూడా సకాలంలో అందక ఇబ్బందులు పడుతున్నామన్నారు. దీనికితోడు తమ నిర్వహణ బాధ్యతలను ప్రవేటు ఏజన్సీలకు అప్పగించడం వలన ప్రభుత్వం నుంచి ఎటువంటి బెనిఫిట్స్ కూడా అందడం లేదన్నారు. వెంటనే తమను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించడంతోపాటు ప్రభుత్వం కల్పించే అన్నీ రాయితీలను అందించాలన్నారు. లేకపోతే ఈ నెల 25 నుంచి సమ్మెలోకి వెళతామన్నారు. అదేవిధంగా ఆరోగ్యశ్రీ జిల్లా కోఆర్డినేటర్ రాజశేఖర్‌ను కలిసి ఆయనకు కూడా సమ్మె నోటీసు అందించారు.



విత్తనాలను పరిశీలిస్తున్న అధికారులు

రాయితీపై విత్తనాల పంపిణీ

తిరుపతి(ఎంఆర్‌పల్లె), నవంబరు 13(ఆంధ్రజ్యోతి): రాయితీపై విత్తనాలు పంపిణీ చేయనున్నట్లు జిల్లా వ్యవసాయాధికారి ప్రసాదరావు తెలిపారు. వరి విత్తనాలు 7,500 క్వింటాళ్లు (ఆర్‌ఎన్‌ఆర్ 15048 రకం 3,800 క్వింటాళ్లు) (కేఎన్‌ఎం 1639రకం 3,700 క్వింటాళ్లు) అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. వేరుశనగ విత్తనాలు 4,102 క్వింటాళ్లు (కే-6రకం 2,800 క్వింటాళ్లు) (టీసీజీఎస్ 1694 రకం 1,302 క్వింటాళ్లు) 40 శాతం రాయితీపై పంపిణీ చేయనున్నట్లు వెల్లడించారు. మినుము విత్తనాలు 50శాతం రాయితీతో వీబీఎన్ 8 రకం 53 క్వింటాళ్లు సిద్ధంగా ఉన్నాయని తెలిపారు. 50శాతం రాయితీతో 18 క్వింటాళ్ల వైఎల్‌ఎం 66 రకం నువ్వులు అందుబాటులో ఉన్నాయని వివరించారు. కాగా, 80శాతం రాయితీతో కంటింజెన్సీ కింద వరి విత్తనాలు (కేఎన్‌ఎం1638రకం) 73.8 క్వింటాళ్లు రైతులకు సరఫరా చేసినట్లు తెలిపారు.

పన్ను చెల్లించని వాహనాలపై కొరడా

● జిల్లావ్యాప్తంగా 1,505 వాహనాలపై కేసు నమోదు



తిరుపతి (జీవకోన), నవంబరు 13(ఆంధ్రజ్యోతి): త్రైమాసిక పన్నులు చెల్లించని ప్రైవేటు (ఎల్లోబోర్డు) వాహనాలపై రవాణా శాఖ కొరడా ఝళిపిస్తోంది. గడువు ముగిసినా పన్ను చెల్లించని వాహనాలపై కేసు నమోదు చేయాలని మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్లను జిల్లా రవాణా శాఖ అధికారి కొర్రపాటి మురళీమోహన్ ఆదేశించారు. దీంతో అధికారులు తనిఖీలు ముమ్మరం చేశారు. పన్ను చెల్లించిన వాహనానికి ఒక మాసం వెసలుబాటు ఇస్తారు. తదుపరి మాసంలో వాహనం పట్టుబడితే వంద శాతం, తర్వాత నెలలో అయితే 200శాతం జరిమానా విధిస్తారు. జిల్లావ్యాప్తంగా అక్టోబరులో 1,420 వాహనాలపై కేసులు నమోదు చేయగా రూ.1.5కోట్లు, ఈనెల 11వ తేదీ వరకు 85 వాహనాలపై కేసులు నమోదు చేయగా 11 రోజుల్లో రవాణా శాఖకు రూ.93లక్షలు ఆదాయం చేకూరింది.

సకాలంలో పన్నులు చెల్లించండి

ప్రైవేటు వాహనాలకు సంబంధించి త్రైమాసిక పన్నులను సకాలంలో చెల్లించేలా యజమానులు చొరవ తీసుకోవాలి. చెల్లించకుండా రోడ్లపై తిరిగితే జరిమానా తప్పదు. వాహనాల యజమానులు రవాణా శాఖ అభివృద్ధికి సహకరించాలి.

- మురళీమోహన్, జిల్లా రవాణాశాఖ అధికారి

ఆ 105ఎకరాలు ఎవరివి?

- మావంటే మావంటున్న అటవీ, రెవెన్యూ శాఖలు
- ముద్దురామాపురంలో వింత పరిస్థితి




విద్యుత్ ఉపకేంద్రం

యాదమరి,నవంబరు13 (ఆంధ్రజ్యోతి):యాదమరి మండలం సిద్దారెడ్డిపల్లి పంచాయతీ ముద్దురామాపురం గ్రామానికి చెందిన 105 ఎకరాల భూమిపై హక్కులు మావంటే మావంటూ అటవీ, రెవెన్యూ అధికారులు పోటీపడుతున్నారు.గ్రామస్థుల కథనం మేరకు... దాదాపు 75 కుటుంబాలు నివాసముంటున్న ముద్దురామాపురంలో ఎంపీపీ, యూపీ పాఠశాలలు, ఆరోగ్య ఉప కేంద్రం, సబ్‌స్టేషన్, సచివాలయ రైతు సేవా కేంద్రం, సీసీ రోడ్లు, భవనాలు ఉన్నాయి. చిత్తూరు - గుడియాత్తం రహదారికి ఇరువైపులా తూర్పు-పడమరగా గ్రామం ఉంటుంది. రోడ్డుకు ఎడమ వైపు ఉన్న ప్రాంతమే సమస్యకు మూలం. అక్కడ వున్న సర్వే నెంబర్ 135లో రెవెన్యూ లెక్కల ప్రకారం 105 ఎకరాల భూమి గయ్యాళి పోరంబోకుగా వుంది.ఆ భూమిలో ఎంపీపీ, యూపీ పాఠశాలలు, ఆరోగ్య ఉప కేంద్రం, సబ్‌స్టేషన్, సచివాలయ రైతు సేవా కేంద్రం, సీసీ రోడ్లు వున్నాయి. అక్కడ ఎప్పటి నుంచో భవనాలు నిర్మించుకొని కొంతమంది నివాసం ఉంటున్నారు.అయితే అటవీశాఖ అధికారులు చాలాకాలంగా ఆ భూమి తమ శాఖకు చెందుతుందంటూ జనజీవనానికి ఆటంకాలు సృష్టిస్తున్నారు.కొత్తగా అక్కడ ఎటువంటి పనులూ చేపట్టరాదంటున్నారు. ఈ నేపథ్యంలో బుధవారం ఉదయం అటవీశాఖ అధికారి డీఆర్వో ఆనందరెడ్డి, రెవెన్యూ అధికారులు ఆ ప్రాంతంలో సర్వే చేపట్టారు. ఈ సందర్భంగా అటవీశాఖ డీఆర్వో ఆనంద రెడ్డి మాట్లాడుతూ...తమ శాఖ వద్ద వున్న రికార్డుల ప్రకారం సర్వే నెంబరు 135లో వున్న మొత్తం భూమి 1892లోనే అటవీ శాఖకు బదలాయించారని తెలిపారు. సర్వేపై నివేదికను డీఎఫ్‌వోకు అందజేయనున్నట్లు చెప్పారు.ఈలోపు ప్రజలు ఎటువంటి నిర్మాణాలు, మట్టి తరలింపు పనులు చేయరాదని సూచించారు.తహసీల్దార్ పార్థసారధి మాత్రం రెవెన్యూ రికార్డుల్లో ఆ భూమి 1922 రీసర్వే ప్రకారం గయ్యాళి పోరంబోకుగానే ఉందని చెప్పుకొచ్చారు.సర్వే నివేదికను కలెక్టర్‌కు పంపుతామన్నారు.


సర్వే చేపడుతున్న రెవెన్యూ, అటవీశాఖ అధికారులు

ఎన్నో ఏళ్ళుగా ఇక్కడేవుంటున్నాం



మా తాతల కాలం నుంచీ ఇక్కడే నివాసముంటున్నాం. ప్రభుత్వం పట్టాలు ఇస్తేనే ఇక్కడ ఇండ్లు నిర్మించుకున్నాం. సిమెంటు రోడ్లు వేశారు. ఇప్పుడు హఠాత్తుగా అటవీశాఖ ఈ భూమి తమదంటున్నారు. ఉన్నతాధికారులు జోక్యం చేసుకుని మాకు న్యాయం చేయాలి.

- అర్ముగం, ముద్దురామాపురం

ద్రావిడ వర్సిటీ ప్రీ-పీహెచ్‌డీ ఫలితాల విడుదల

గుడుపల్లె, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): ద్రావిడ విశ్వవిద్యాలయంలో అక్టోబరులో నిర్వహించిన ప్రీ-పీహెచ్‌డీ పరీక్షల ఫలితాలను బుధవారం వీసీ ఆచార్య దొరస్వామి, రిజిస్ట్రార్ విడుదల చేశారు. అన్ని కోర్సులలో పరిశోధకులు 99శాతం ఉత్తీర్ణత సాధించినట్లు తెలిపారు. ఫలితాలను విశ్వవిద్యాలయ వెబ్‌సైట్‌లో చూసుకోవచ్చునని తెలిపారు.

పంటలపై కొనసాగుతున్న గజదాడులు


మతుకువారిపల్లి వద్ద ధ్వంసమైన వరి పంట

కల్లూరు, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): పులిచెర్ల మండలంలో పంటలపై ఏనుగుల దాడులు ఆగడంలేదు. మతుకువారిపల్లి పంచాయతీలో మంగళవారం రాత్రి వరి, కొబ్బరి, అరటి పంటలను ఏనుగుల గుంపు ధ్వంసం చేయడంతో తీవ్రనష్టం వాటిల్లింది. ముందుగా పాతపాళ్యం అడవి నుంచి బయలుదేరిన ఏనుగుల గుంపు పాతపేట, చల్లావారిపల్లి మీదుగా కల్లూరు-సదుం రోడ్డు దాటుకుని మతుకువారిపల్లి పంచాయతీలోకి చేరుకున్నాయి. వడ్డిపల్లిలోని వెంకటేశులుకు చెందిన వరిపంట, రెండు కొబ్బరిచెట్లు, అరటి చెట్లను ధ్వంసం చేశాయి. కౌలు రైతులు యర్రయ్య, గీతకు చెందిన వరిపంటను ఏనుగులు తొక్కేశాయి. ఇదే గ్రామానికి చెందిన యర్రయ్య, సుబ్రమణ్యం, వెంకట్రమణకు చెందిన వరిపంట, రెండు కొబ్బరిచెట్లను ఏనుగులు ధ్వంసం చేశాయి.

టీడీపీ శాశ్వత సభ్యత్వం స్వీకరణ


సీఎం చంద్రబాబు నుంచి శాశ్వత సభ్యత్వం తీసుకొంటున్న వీరపల్లి హేమాంబరధరరావు

చంద్రగిరి, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): చంద్రగిరి మండలం ఏజీపల్లెకు చెందిన చెందిన టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వీరపల్లి హేమాంబరధరరావు పార్టీ శాశ్వత సభ్యత్వాన్ని పొందారు. పార్టీకి సభ్యత్వ రుసుం కింద లక్ష రూపాయలు చెల్లించారు. బుధవారం ఆయన విజయవాడలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడిని కలిసి ఈ సభ్యత్వాన్ని స్వీకరించారు. పార్టీలో శాశ్వత సభ్యత్వం తీసుకున్న వారికి తగిన ప్రాధాన్యం ఉంటుందని సీఎం చెప్పినట్లు హేమాంబరధరరావు పేర్కొన్నారు. ఆయన్ను సీఎం అభినందించారు.

నిధుల గోల్‌మాల్‌పై జడ్పీ సీఈవో విచారణ


అధికారులను విచారిస్తున్న జడ్పీ సీఈవో

పుంగనూరు, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): పుంగనూరు ఎంపీడీవో కార్యాలయంలో జరిగిన నిధుల గోల్‌మాల్‌పై బుధవారం జడ్పీ సీఈవో రవి కుమార్‌నాయుడు విచారణ చేపట్టారు. గతంలో ఎంపీడీవో కార్యాలయంలో దాదాపు రూ. 1.36కోట్లు గోల్‌మాల్‌లో ఏవో పని చేస్తూ సస్పెండ్ అయిన రాజేశ్వరిని విచారించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిధుల గోల్‌మాల్‌పై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు ఆయన వివరించారు. పోలీసుల విచారణ తర్వాత శాఖాపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో లీలామాధవి. ఏవో రెడ్డెమ్మ పాల్గొన్నారు.

19న కాణిపాకంలో సంకటహర గణపతి వ్రతం

ఐరాల(కాణిపాకం), నవంబరు 13(ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రమైన కాణిపాకంలో ఈనెల 19వ తేదీన సంకటహర గణపతి వ్రతం నిర్వహించనున్నట్లు ఈవో గురుప్రసాద్ బుధవారం తెలిపారు. ఈ కార్యక్రమాన్ని ఆలయ ఆస్థాన మండపంలో రెండు దఫాలుగా నిర్వహించనున్నారు. వ్రతం ముగిసిన అనంతరం రాత్రి సిద్ధి, బుద్ధి సమేత వరసిద్ధుడు స్వర్ణ రథంపై విహరించనున్నట్లు ఈవో తెలిపారు. ఈ కార్యక్రమానికి వేలాదిగా భక్తులు హాజరై స్వామి కృపకు పాత్రులు కావాలని ఈవో కోరారు.

సినీనటుడు పోసానిపై టీడీపీ ఫిర్యాదు


ఫిర్యాదు చేస్తున్న టీడీపీ నాయకులు

యాదమరి, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): టీటీడీ చైర్మన్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన సినీనటుడు పోసాని కృష్ణ మురళిపై చిత్తూరు జిల్లా యాదమరి మండల టీడీపీ నేతలు పోలీసులకు ఫిర్యాదు చేశారు.మంగళవారం మీడియా డిబేట్‌లో బీఆర్ నాయుడిపై పోసాని అనుచిత వ్యాఖ్యలు చేయడంపై ఈ ఫిర్యాదు చేశారు.తెలుగుయువత జిల్లా అధికార ప్రతినిధి వల్లేరు అమరనాథ నాయుడు, మండల టీడీపీ ప్రధాన కార్యదర్శి వెంకటేష్ బుధవారం సాయంత్రం సీఐ శ్రీధర్ నాయుడు, ఎస్‌ఐ ఈశ్వర్‌లకు ఫిర్యాదు చేశారు.



పూజాద్రవ్యాలను తీసుకొస్తున్న ఈవో గురుప్రసాద్, ఏఈవో రవీంద్రబాబు - హోమం నిర్వహిస్తున్న అర్చకుడు ధర్మేశ్వరగురుకుల్

కాణిపాకంలో వైభవంగా వ్రత సమర్పణ

ఐరాల(కాణిపాకం), నవంబరు 13(ఆంధ్రజ్యోతి): కాణిపాక క్షేత్రంలో నిర్వహిస్తున్న పవిత్రోత్సవాలలో భాగంగా రెండవ రోజైన బుధవారం వ్రత సమర్పణను అర్చక, పండితులు వైభవంగా నిర్వహించారు. ఉదయం విశేషసంధి, రెండవ కాల పూజ, స్థండిల మండలేశ్వర పూజ, హోమం, వ్రత సమర్పణ, రెండవ కాల పవిత్ర సమర్పణం, విశేష ద్రవ్యాహుతి, పూర్ణాహుతి నిర్వహించారు. సాయంత్రం విశేష సంధి, మూడవ కాల పూజ, స్థండిల మండలేశ్వర పూజ, హోమం, వ్రత సమర్పణ, మూడవ కాల పవిత్ర సమర్పణ, విశేష ద్రవ్యాహుతి, పూర్ణాహుతి నిర్వహించారు. కార్యక్రమంలో ఈవో గురుప్రసాద్, ఏఈవో రవీంద్రబాబు, సూపరింటెండెంట్లు వాసు, కోదండపాణి, ఆలయ ఇన్‌స్పెక్టర్లు విఘ్నేష్, రవి తదితరులు పాల్గొన్నారు.

మానవ హక్కుల గురించి వైసీపీ నాయకులు మాట్లాడడం విడ్డూరం

- టీడీపీ నేతల ధ్వజం


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న టీడీపీ నేతలు

చిత్తూరు సిటీ, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): వైసీపీ నాయకులు మానవ హక్కుల గురించి మాట్లాడటం విడ్డూరంగా ఉందని టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి సప్తగిరి ప్రసాద్, చిత్తూరు పార్లమెంటు ప్రధాన కార్యదర్శి కోదండయాదవ్ అన్నారు. బుధవారం జిల్లా పార్టీ కార్యాలయంలో వారు మీడియాతో మాట్లాడుతూ ఏపీలో మానవ హక్కుల ఉల్లంఘన జరుగుతోందని ఢిల్లీలో కేంద్ర మానవహక్కుల కమిషన్‌కు ఫిర్యాదు చేయడం దెయ్యాలు వేదాలు వల్లించినట్లుందన్నారు. గత వైసీపీ పాలనలో నాటి ముఖ్యమంత్రి జగన్ ఐదు సంవత్సరాలు ప్రజా వ్యతిరేక, నియంత పాలనలో వైసీపీ సోషల్ మీడియా సైకోలు బరితెగించారని చెప్పారు. రాష్ట్రంలో ప్రముఖ రాజకీయ నేతలు, వారి కుటుంబ సభ్యులు, బంధువులపైన సోషల్ మీడియా వేదికగా తప్పుడు పోస్టులు పెట్టి మానసిక క్షోభకు గురిచేశారని అన్నారు. చివరికి జగన్ తన సొంత తల్లి, చెల్లి, చిన్నాన్న కూతురు, గౌరవ ప్రదమైన న్యాయస్థానాల తీర్పులపైన, న్యాయమూర్తులపైన సోషల్ మీడియాలో జుగుప్సాకరమైన పోస్టులు పెట్టారని ఆరోపించారు. జాతీయ మానవ హక్కుల కమిషన్ గత వైసీపీ ప్రభుత్వంలో జరిగిన మానవహక్కుల ఉల్లంఘనలపై పూర్తి విచారణ జరిపితే వైసీపీ నిజస్వరూపం బయటపడుతుందని అన్నారు. కార్యక్రమంలో నేతలు మోహన్ రాజ్, మేషాక్, ధరణి ప్రకాష్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

పేట అగ్రహారం రైతుల సమస్యలను పరిష్కరిస్తాం

కలెక్టర్ సుమిత్‌కుమార్


రైతులతో మాట్లాడుతున్న కలెక్టర్ సుమిత్‌కుమార్

పూతలపట్టు, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): పేట అగ్రహారం ప్రజలతో పాటు రైతుల సమస్యను వెంటనే పరిష్కరిస్తానని కలెక్టర్ సుమిత్‌కుమార్ హామీ ఇచ్చారు. బుధవారం ఆయన మండలంలోని పేట అగ్రహారం సమీపంలో గల సిక్స్ లేన్ రోడ్డును పరిశీలించారు. ఆరు సంవత్సరాల క్రితం తిరుపతి నుంచి బెంగళూరు వరకు సిక్స్ లైన్ రహదారిని నిర్మించారు. ఇందులో భాగంగా పేటఅగ్రహారం గ్రామం వద్ద ఆర్ అండ్ బీ అధికారులు డ్రైనేజీ కాలువను నిర్మించకుండానే జాతీయ రహదారిని ఏర్పాటు చేశారు. దీంతో చిన్నపాటి వర్షం కురిసినా వర్షపునీరంతా గ్రామంలోకి వెళ్లడంతో పాటు మామిడి, వరి, వేరుశనగ, కోళ్లఫారాలు మునిగిపోయేవి. దీంతో వర్షం వస్తే గ్రామం మునిగిపోతుందేమోనని గ్రామస్థులు భయాందోళనలకు గురయ్యేవారు. దీనిపై 10 రోజుల క్రితం తహసీల్దార్ కార్యాలయంలో స్థానిక ఎమ్మెల్యే మురళీమోహన్ అధ్యక్షతన నేషనల్ హైవే అధికారులతో పాటు పలుశాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో నేషనల్ హైవే అధికారుల పనితీరుపై ఎమ్మెల్యే మురళీమోహన్ ఆగ్రహం వ్యక్తం చేసి, సమస్యను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో కలెక్టర్ సంబంధిత శాఖ అధికారులను పిలిపించి బుధవారం పేటఅగ్రహారంలోని రైతుల వద్ద వివరాలను సేకరించారు. త్వరలో సమస్యకు పరిష్కార మార్గాన్ని చూపుతామని, రైతులు ఆందోళన పడవద్దని హామీయిచ్చారు. కార్యక్రమంలో మండల టీడీపీ కన్వీనర్ దొరబాబు చౌదరి, తహసీల్దార్ గుర్రప్పతో పాటు నేషనల్ హైవే, ఆర్ అండ్ బీ, రెవెన్యూ, పలుశాఖల అధికారులు పాల్గొన్నారు.

క్రీడా వికాసానికి సర్కార్ పెద్దపీట: రవినాయుడు

అమరావతి, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): దేశంలో ఎక్కడా లేని విధంగా క్రీడాకారులకు ఉద్యోగాల్లో 3శాతం రిజర్వేషన్ కల్పించిన సీఎం చంద్రబాబు.. క్రీడారంగ అభివృద్ధికి బడ్జెట్‌లో రూ.100కోట్లు కేటాయించారని శాప్ చైర్మన్ ఎ.రవినాయుడు చెప్పారు. క్రీడా వికాసానికి కూటమి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందన్నారు. టీడీపీ కేంద్ర కార్యాలయంలో బుధవారం ఆయన మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలో క్రీడాకారులు బాగా రాణించేందుకు కూటమి ప్రభుత్వం అన్ని సదుపాయాలు కల్పిస్తోందని చెప్పారు. కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, బ్యాడ్మింటన్ క్రీడల్లో యువత రాణించేందుకు సీఎం చంద్రబాబు, విద్యామంత్రి లోకేశ్ కృషి చేస్తున్నారని చెప్పారు. పాఠశాలల క్రీడాకారులకు దుస్తులు, అలవెన్స్ ముందే విడుదల చేశారని తెలిపారు.

పంటలపై కొనసాగుతున్న గజదాడులు


మతుకువారిపల్లి వద్ద ధ్వంసమైన వరి పంట

కల్లూరు, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): పులిచెర్ల మండలంలో పంటలపై ఏనుగుల దాడులు ఆగడంలేదు. మతుకువారిపల్లి పంచాయతీలో మంగళవారం రాత్రి వరి, కొబ్బరి, అరటి పంటలను ఏనుగుల గుంపు ధ్వంసం చేయడంతో తీవ్రనష్టం వాటిల్లింది. ముందుగా పాతపాళ్యం అడవి నుంచి బయలుదేరిన ఏనుగుల గుంపు పాతపేట, చల్లావారిపల్లి మీదుగా కల్లూరు-సదుం రోడ్డు దాటుకుని మతుకువారిపల్లి పంచాయతీలోకి చేరుకున్నాయి. వడ్డిపల్లిలోని వెంకటేశులుకు చెందిన వరిపంట, రెండు కొబ్బరిచెట్లు, అరటి చెట్లను ధ్వంసం చేశాయి. కౌలు రైతులు యర్రయ్య, గీతకు చెందిన వరిపంటను ఏనుగులు తొక్కేశాయి. ఇదే గ్రామానికి చెందిన యర్రయ్య, సుబ్రమణ్యం, వెంకట్రమణకు చెందిన వరిపంట, రెండు కొబ్బరిచెట్లను ఏనుగులు ధ్వంసం చేశాయి.

ఎర్రచందనం స్మగ్లింగు కేసులో తండ్రీ కొడుకులకు ఐదేళ్ల జైలు

- రూ.6 లక్షల జరిమానా విధించిన న్యాయమూర్తి


తోట చిన్న గంగయ్య - తోట చెంగయ్య

రేణిగుంట/మంగళం, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): ఎర్రచందనం అక్రమ రవాణా చేస్తూ పట్టుబడిన తండ్రీ కొడుకులకు ఎర్రచందనం కేసులప్రత్యేక కోర్టు న్యాయమూర్తి నరసింహమూర్తి ఐదేళ్ల జైలు శిక్ష, రూ.6లక్షల జరిమానా విధించారు. ఈ మేరకు టాస్క్‌ఫోర్స్ అధికారులు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. రేణిగుంట మండలం కరకంబాడి బీటు కృష్ణాపురం సెక్షన్‌లో ఎర్రచందనం అక్రమ రవాణా చేస్తూ అన్నమయ్య జిల్లా పెనగలూరు మండలం సిరివరం గ్రామానికి చెందిన తోట చిన్న చెంగయ్య, ఆయన కుమారుడు చెంగయ్య పట్టుబడినట్లు పేర్కొన్నారు. వీరిద్దరిపై 2019 2022 సంవత్సరాల్లో కేసులను నమోదు చేశామన్నారు. ఇంతకాలంగా కొనసాగుతున్న విచారణలో వీరిని దోషులుగా గుర్తించి ఆర్ఎస్ఎస్ ఏడీజే న్యాయస్థాన న్యాయమూర్తి నరసింహమూర్తి తండ్రీ కొడుకులకు జైలు శిక్ష, జరిమానా విధిస్తూ బుధవారం తీర్పు చెప్పారన్నారు. శిక్ష పడిన వారిని నెల్లూరు సెంట్రల్ జైలుకు తరలించినట్లు టాస్క్‌ఫోర్స్ డీఎస్పీ బాలిరెడ్డి తెలిపారు. ఈ తీర్పు ఎర్రచందనం స్మగ్లర్లకు ఒక హెచ్చరికగా పనిచేస్తుందన్నారు.

సికింద్రాబాద్- తిరుపతి ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ రద్దు

తిరుపతి(సెంట్రల్), నవంబరు13 (ఆంధ్రజ్యోతి): ప్రయాణికుల రద్దీని దృష్టిలో వుంచుకొని సికింద్రాబాదు- తిరుపతి మధ్య బుధ, గురువారాల్లో రాక పోకలు నిర్వహించే ప్రత్యేక రైళ్ళు(07041-07042) రద్దు చేస్తున్నట్లు దక్షిణ మధ్య రైల్వే సీపీఆర్వో ఎ.శ్రీధర్ ఒక ప్రకటనలో తెలిపారు. టికెట్లు రిజర్వేషన్ చేసుకున్న ప్రయాణికులు గుర్తించుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

రెవెన్యూ సమస్యల పరిష్కారంలో చొరవ చూపాలి

కలెక్టర్ సుమిత్ కుమార్

చిత్తూరు సెంట్రల్, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): రెవెన్యూ సమస్యలపై తహసీల్దార్లు వెంటనే స్పందించి బాధితులకు న్యాయం చేయాలని కలెక్టర్ సుమిత్ కుమార్ సూచించారు. బుధవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో మ్యూటేషన్, వెబ్ ల్యాండ్ కరక్షన్ అంశాలపై అందుతున్న దరఖాస్తుల పరిష్కారంపై చిత్తూరు, నగరి డివిజన్ల ఆర్డీవోలు, తహసీల్దార్లతో సమీక్షా సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఎంతో నమ్మకంతో రెవెన్యూ సమస్యలపై వచ్చే ఇరు పార్టీలతో మాట్లాడి పరిష్కారం చూపాలన్నారు. మ్యూటేషన్, వెబ్ ల్యాండ్ కరెక్షన్ నిర్ణీత గడువులోపు రికార్డులు పరిశీలించి పరిష్కరించాలన్నారు. పీజీఆర్ఎస్ అర్జీల పరిష్కారానికి అధిక ప్రాధాన్యత ఇస్తూ షెడ్యూల్ మేరకు అర్జీదారులతో ప్రతి శనివారం హియరింగ్ నిర్వహించి చర్యలు చేపట్టాలన్నారు. పంచాయతీరాజ్, విద్యా, వైద్య, ఇరిగేషన్, దేవదాయ, పంచాయతీ, మార్కెటింగ్ సంబంధిత శాఖల ఆధీనంలోని భవనాలు, భూములు ఆక్రమణలకు గురైతే, రెవెన్యూ శాఖ సమన్వయంతో వాటిని తొలగించాలని ఆదేశించారు. కోర్టు కేసులలో నిర్ణీత గడువులోపు కౌంటర్ దాఖలు చేయాలని ఆదేశించారు. సమావేశంలో జేసీ విద్యాధరి, డీఆర్వో మోహన్‌కుమార్, చిత్తూరు నగరి ఆర్డీవోలు శ్రీనివాసులు, భవానీ శంకరి, కలెక్టరేట్ ఏవో కులశేఖర్, సర్వే శాఖ ఏడీ జయరాజ్, తహసీల్దార్లు పాల్గొన్నారు.

పిల్లలను న్యూమోనియా నుంచి కాపాడుకుందాం

చిత్తూరు సెంట్రల్, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): చిన్నారులను న్యూమోనియా నుంచి కాపాడేందుకు వ్యాక్సినేషన్ తప్పనిసరిగా వేయాలని కలెక్టర్ సుమిత్ కుమార్ అన్నారు. బుధవారం కలెక్టరేట్‌లో న్యూమోనియా గోడపత్రికను కలెక్టర్ ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ వ్యాధి నిరోధక శక్తి తక్కువగా ఉండే పిల్లల్లో, వయస్సు పైబడిన వారిలో ఎక్కువగా వచ్చే న్యూమోనియా వ్యాధి నుంచి కాపాడేందుకు అవసరమైన వ్యాక్సినేషన్ డోస్‌లను నిర్ణీత కాల వ్యవధిలో వేయాలన్నారు. ● అదే విధంగా వైద్య ఆరోగ్యశాఖ రాష్ట్రీయ బాల ఆరోగ్య సురక్ష కింద ఆరోగ్య ప్రగతి రికార్డు పోస్టర్‌ను లాంఛనంగా ప్రారంభించారు. గురువారం నుంచి అన్ని అంగన్వాడీ కేంద్రాలు, ప్రాథమిక పాఠశాలలు, హైస్కూల్లోని విద్యార్థులకు హెల్త్ చెకప్, చికిత్స అవసరమైన కేసులను డీఈఐసీ సెంటర్‌కి రిఫర్ చేసి చికిత్స ఇవ్వాలని కలెక్టర్ సూచించారు. ● జిల్లాలో 18 సంవత్సరాలు దాటిన ప్రతి ఒక్కరూ క్యాన్సర్ నిర్ధారణా పరీక్షలు చేయించుకోవాలని కలెక్టర్ సూచించారు. గురువారం నుంచి ఇంటి వద్దకే క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు నిర్వహించాలని వైద్య శాఖ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. సీహెచ్‌ఓ, ఏఎన్ఎం, ఆశ కార్యకర్తలు రోజుకి ఐదు ఇళ్లు మాత్రమే స్క్రీనింగ్ పరీక్షలు చేయాలన్నారు. గోడపత్రిక ఆవిష్కరణలో ట్రైనీ కలెక్టర్ హిమవంశీ, డీఎంహెచ్‌వో డాక్టర్ ప్రభావతిదేవి, స్త్రీ సంక్షేమ శాఖ అధికారిణి హైమావతి తదితరులు పాల్గొన్నారు.

16నుంచి అరగొండలో రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలు


సాఫ్ట్‌బాల్ పోటీలకు మైదానాన్ని సిద్ధం చేస్తున్న సిబ్బంది

తవణంపల్లె, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): మండలంలోని అరగొండ, తవణంపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో ఈ నెల 16వ తేదీ నుంచి రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ క్రీడా పోటీలు నిర్వహించనున్నట్లు అరగొండ పాఠశాల పీఈటీ శ్రీనివాసులు తెలిపారు. ఈ పోటీల్లో రాష్ట్రవ్యాప్తంగా 13 జిల్లాల నుంచి క్రీడాకారులు పాల్గొననున్నట్లు ఆయన పేర్కొన్నారు.

నేటి మాదిగల ఆత్మీయ సమావేశాన్ని జయప్రదం చేయండి

పుంగనూరు : మదనపల్లెలో గురువారం జరిగే మాదిగల ఆత్మీయ సమావేశాన్ని విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ నియోజకవర్గ కన్వీనర్ నరసింహులు పిలుపునిచ్చారు. ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మందకృష్ణమాదిగ హాజరుకానున్నట్లు తెలిపారు.

ఆర్టీసీ ఆదర్శ ఉద్యోగులకు ప్రోత్సాహక బహుమతులు

పుంగనూరు రూరల్ : ఆర్టీసీకి ఆదాయాన్ని చేకూర్చి ఆదర్శంగా నిలచిన ఉద్యోగులకు ప్రోత్సాహ బహుమతులు అందజేసినట్లు డిపో మేనేజర్ సుధాకరయ్య తెలిపారు. డ్రైవర్లు అన్వర్, జీఎం. బాషా, కండక్టర్లు అనసూయ, దుర్గాప్రసాద్ బహుమతులు అందుకున్నారు.

నేటి నుంచి గ్రంథాలయ వారోత్సవాలు

కుప్పం/చౌడేపల్లె/పుంగనూరు రూరల్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): కుప్పం శాఖా గ్రంథాలయంలో బాలల దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం ఉదయం 9 గంటలకు జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను ప్రారంభించనున్నట్లు గ్రంథాలయాధికారి సత్యవాణి తెలిపారు. ఈనెల 20వ తేదీ దాకా నిర్వహించే ఈ వారోత్సవాలలో కుప్పం పరిధిలోని ఎంఎఫ్‌సీ ప్రభుత్వ కళాశాల, బీసీ బాలికల వసతి గృహంలోని పిల్లలకు వివిధ అంశాలపై పోటీలు నిర్వహిస్తామని చెప్పారు. చౌడేపల్లెలో 15న పుస్తక ప్రదర్శన, మాదకద్రవ్యాల నియంత్రణపై అవగాహన, 17న కవిసమ్మేళనాలు, రచయితల సందేశాలు, 18న చిత్రలేఖనం, వ్యాసరచన, వక్తృత్వ క్విజ్, క్రీడల పోటీలు, 19న మహిళలకు వివిధ కార్యక్రమలపై పోటీలు నిర్వహించనున్నట్లు నిర్వహకులు సోమశేఖర్ తెలిపారు. పుంగనూరులో శుక్రవారం పుస్తక ప్రదర్శన, శనివారం గ్రంథాలయ ఉద్యమంలో పాల్గొన్న ప్రముఖులను స్మరించుట, ఆదివారం కవి సమ్మేళనాలు, సెమినార్లు, సోమవారం చిత్రలేఖనం, వ్యాసరచనలు, వక్తృత్వ క్విజ్, క్రీడాపోటీలు, మంగళవారం రంగవల్లి, అల్లికలు, బుధవారం డిజిటల్ గ్రంథాలయాలపై విద్యార్థులకు అవగాహన తదితర కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు గ్రంథాలయాధికారి తులసి తెలిపారు.

పాత కక్షలతో యువకుడిపై దాడి

పుంగనూరు రూరల్, నవంబరు13 (ఆంధ్రజ్యోతి): పాత కక్షలతో ఓ యువకుడిపై దాడి చేసి గాయపరిచిన ఘటన బుధవారం పుంగనూరులో చోటుచేసుకుంది. పట్టణంలోని బీడీకాలనీకి చెందిన బాబు కుమారుడు మహమ్మద్‌రఫీక్‌కు సాన్‌వాజ్, ముబారక్, రోషన్‌లు మంచి స్నేహితులు. కొద్దిరోజులుగా వీరి మధ్య మనస్పర్థలు రావడంతో విడిపోయారు. మంగళవారం రాత్రి రోడ్డు ప్రమాదం జరిగి సాన్‌వాజ్, ముబారక్, రోషన్‌లు గాయపడినట్లు మహమ్మద్ రఫీక్‌కు ఫోన్ ద్వారా సమాచారం వచ్చింది. విషయం తెలుసుకున్న మహమ్మద్‌రఫీక్ ఘటనా స్థలానికి చేరుకున్నారు. పథకం ప్రకారం మహమ్మద్‌రఫీక్‌పై ముగ్గురూ ఒకేసారి దాడి చేసి గాయపర్చారు. ఈ మేరకు పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు బాధితుడు తెలిపారు.

కురబ కార్పొరేషన్ డైరెక్టరుకు సన్మానం

రొంపిచెర్ల, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : తెలుగుదేశం పార్టీ అభివృద్ధికి కష్టపడి పని చేస్తానని రాష్ట్ర కురబ కార్పొరేషన్ డైరెక్టరు ఉయ్యాల రమణ అన్నారు. బుధవారం



రొంపిచెర్ల షాదీమహల్‌లో ఉయ్యాల రమణ ఎంపికపై పుంగనూరు, చౌడేపల్లి, సోమల, సదం, పులిచెర్ల, రొంపిచెర్ల మండలాలకు చెందిన పార్టీ నాయకులు, కార్యకర్తలు చల్లాబాబుతోపాటు ఉయ్యాల రమణను ఘనంగా సన్మానించారు.

రొంపిచెర్లలో జోరుగా వర్షం

రొంపిచెర్ల, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : అల్పపీడన ద్రోణి ప్రభావంతో రొంపిచెర్ల మండలంలో రాత్రి నుంచి వర్షం కురుస్తోంది. రెండు రోజులుగా పలుగ్రామాల్లో మోస్తరు వర్షం కరిసింది. అడపాదడపా కురుస్తున్న వర్షాలతో రైతులు వ్యవసాయ పనులకు వెళ్లలేకపోయారు.

సదుం ఆస్పత్రిలో అరకొర వైద్యం

- భవనం అద్భుతం
- వైద్య సేవలు అంతంత మాత్రమే



సదుం, నవంబరు 13(ఆంధ్రజ్యోతి) : సదుం-ఎర్రాతివారిపల్లె మార్గంలో నూతనంగా నిర్మించిన 50 పడకల ప్రభుత్వ ఆస్పత్రి కార్పొరేట్ ఆస్పత్రులను తలదన్నే విధంగా అన్ని వసతులతో సుందరంగా నిర్మించారు. అయితే స్థాయికి తగ్గ వైద్య పరికరాలు లేక రోగులకు అరకొర వైద్యమే అందుతోంది. ఆస్పత్రిలో ఉన్న రెండు వీల్ చైర్స్‌లో ఒకటి దెబ్బతింది. బ్రిటీష హయాంలో సదుంలో వారణాశి మలిరెడ్డి పేరున 1832నుంచి పీహెచ్‌సీ ఉండేది. కాలక్రమంలో శిథిలావస్థకు చేరుకోవడంతో ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి తన తండ్రి పెద్దిరెడ్డి లక్ష్మిరెడ్డి పేరిట రోడ్డు పక్కనే 10ఎకరాల స్థలాన్ని భవన నిర్మాణానికి విరాళంగా అందించారు. గత వైసీపీ ప్రభుత్వంలో రూ.8 కోట్ల వ్యయంతో ఆస్పత్రి నిర్మాణం కూడా చేశారు. వైద్యులను, తగిన సిబ్బందిని, నియమించారు. గతంలో పీహెచ్‌సీ గ్రామ నడిబొడ్డున ఉండేది. అన్ని పంచాయతీలకు అనుకూలంగా ఉండేది. ప్రస్తుతం 50 పడకల ఆస్పత్రిగా అప్‌గ్రేడ్ అయినప్పటికీ ఊరికి దూరంగా విసిరేసినట్లు ఉండడంతో వెళ్లేందుకు బాలింతలు, వృద్ధులు, మహిళలు వ్యయప్రయాసలు పడుతున్నారు. ఆస్పత్రికి వెళ్లాలంటే రూ.30 నుంచి రూ.50 ఆటో ఛార్జీలు వసూలు చేస్తున్నారు.

తాగు నీటి కొరత

ఆస్పత్రి ఆవరణలో రెండు బోర్లు వేసినప్పటికీ నీరు రాలేదు. సమీపంలోని ఎస్.ఎం.పల్లె బోరు నుంచి పైప్‌లైన్ ద్వారా సంపులోకి నీటిని నింపి పైపుల ద్వారా నీటి సరఫరా జరుగుతోంది. నీటికొరత ఇబ్బందిగా మారింది.

తగిన వైద్య పరికరాలు లేవు

50 పడకల ఆస్పత్రికి అవసరమైన వైద్య పరికరాలు లేవు. ఉన్న రెండు వీల్ చైర్స్‌లో ఒకటి డ్యామేజ్ కావడంతో ఒకటే అందుబాటులో ఉంటోంది. మంచాలు 50 ఉన్నప్పటికీ వాటిపై 10, 15 మంచాలపైనే బెడ్లు ఏర్పాటు చేశారు. ఉన్న 100 ఎంబీ మొబైల్ ఎక్స్‌రే వల్ల ఉపయోగం ఉండడం లేదు. అలాగే ఆపరేషన్ థియేటర్ గదులు చాలా చిన్నవిగా ఉన్నాయి. గైనిక్ ఆపరేషన్లకు కొంత ఇబ్బందిగా ఉంది. ప్రస్తుతం వేసక్టమీ, ట్యూబెక్టమీ, జనరల్ ఆపరేషన్లు జరుగుతున్నాయి.

వాహన సదుపాయం

108, 102, 104 అంబులెన్స్ వాహనాలున్నాయి. తల్లీ బిడ్డ వాహన సదుపాయం లేదు. ఆక్సిజన్ వాహనం కూడా లేకపోవడంతో చాలా వరకు సీరియస్ కేసులను పీలేరు, తిరుపతి ఆస్పత్రులకు రెఫర్ చేస్తున్నారు.

రాత్రి వేళ అందని వైద్య సేవలు

ఆస్పత్రి మెడికల్ ఆఫీసర్ డా.పుష్ప కుమారితోపాటు తొమ్మిది మంది వైద్యులున్నారు. వీరందరూ షిఫ్టుల వారీగా డ్యూటీలో రోస్టర్‌లో మాత్రమే కనిపిస్తున్నాయని, రాత్రి వేళ రోగులకు వైద్యులు అందుబాటులో ఉండడం లేదని పలువురు రోగులు చెబుతున్నారు. ఏడాదిగా చిన్నపిల్లల వైద్య నిపుణులు లేక చిన్నారులు ఇబ్బందులకు గురవుతున్నారు. ఐదురోజుల క్రితం చిన్నపిల్లల డాక్టర్ని సదుంకు నియమించినట్లు మెడికల్ ఆఫీసర్ తెలిపారు.

రోజువారీ ఓపీ, ఇన్ పేషెంట్లు

రోజువారీ ఔట్ పేషెంట్లు రిజిస్టర్‌లో 300కు పైగా వస్తున్నట్లు ఉంటున్నా వాస్తవానికి సుమారు 200 మంది మాత్రమే వస్తున్నట్లు తెలిసింది. ఇన్ పేషెంట్లు 10మంది లోపే ఉంటున్నారు. వారిలో కొందరు ఇంటికి వెళ్లి రోజూ వచ్చిపోతున్నట్లు సిబ్బంది చెప్పారు. రాత్రి వేళల్లో డాక్టర్లు ఉన్నప్పటికీ రెస్ట్ రూముకు పరిమితం కావడంతో స్టాఫ్ నర్సులే వైద్యం చేస్తున్నారు. అర్థోపెడిక్, జనరల్ సర్జన్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. పీడియాట్రిక్ డాక్టర్ కూడా డిప్యూటేషన్‌పై వస్తున్నారు. మొత్తానికి ఆస్పత్రి భవనం అధునాతనంగా నిర్మించినప్పటికీ స్థాయికి తగ్గ వైద్య పరికరాలు, సదుపాయాలు లేక రోగులకు ఇబ్బందుల తప్పడం లేదు.

లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తే చర్యలు



కుప్పంలో స్కానింగ్ సెంటర్‌ను తనిఖీ చేస్తున్న డాక్టర్ హనుమంతరావు

కుప్పం, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): ఆసుపత్రులలో కానీ, స్కానింగ్ కేంద్రాలలో కానీ లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తే చట్టపరమైన చర్యలు తప్పవని జిల్లా పీసీపీఎన్డీటీ నోడల్ అధికారి డాక్టర్ హనుమంతరావు హెచ్చరించారు. కుప్పంలోని రత్న హాస్పిటల్, శ్యామల హాస్పిటల్, శ్రీప్రియా నర్సింగ్ హోం, సంజీవ్ హాస్పిటల్ తదితర ఆసుపత్రులను ఆయన బుధవారం తనిఖీ చేశారు. లింగ నిర్ధారణ పరీక్షలు చేసినట్లు తేలితే పీసీపీఎన్డీటీ యాక్ట్ కింద రూ.10 వేలు జరిమానాతోపాటు ఐదేళ్ల జైలు శిక్ష పడుతుందన్నారు. అలాగే రిజిస్ట్రేషన్ గడువు పూర్తి అయినవారు రెన్యువల్ చేసుకోవాలని సూచించారు. అలాచేసుకోని పక్షంలో సీజ్ చేస్తామని హెచ్చరించారు.

సమస్యలుంటే పోలీసులకు చెప్పండి : డీఎస్పీ



మాట్లాడుతున్న పలమనేరు డీఎస్పీ ప్రభాకర్

పుంగనూరు, నవంబరు13(ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు ఏవైనా సమస్యలుంటే పోలీసుల దృష్టి తీసుకురావాలని డీఎస్పీ ప్రభాకర్ కోరారు. బుధవారం పట్టణ సమీపంలోని నక్కబండ కాలనీలోని కస్తూరిబా పాఠశాల విద్యార్థులతో ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయుల ద్వారా ఇబ్బందులున్నా వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని, వివరాలు తెలిపిన వారి పేర్లను గోప్యంగా ఉంచుతామన్నారు. కార్యక్రమంలో సీఐ శ్రీనివాసులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

పుంగనూరు రూరల్, నవంబరు13(ఆంధ్రజ్యోతి): రెండు ద్విచక్రవాహనాలు ఢీకొని ఇద్దరు వ్యక్తులు గాయపడిన ఘటన బుధవారం రామసముద్రం మండలంలో జరిగింది. రామసముద్రం మండలం నర్సాపురానికి చెందిన వెంకటరమణ ద్విచక్రవాహనంలో వెళుతుండగా చెంబకూరుకు చెందిన శ్రీనివాస్ ద్విచక్రవాహనంలో నర్సాపురం వద్ద వెళుతూ ఇద్దరూ ఢీకొన్నారు. ఈ ప్రమాదంలో గాయపడిన ఇద్దరిని స్థానికులు పుంగనూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్సలు అందించారు.

కడుపునొప్పి తాళలేక మహిళ ఆత్మహత్యాయత్నం

పుంగనూరు రూరల్, నవంబరు13(ఆంధ్రజ్యోతి): పుంగనూరు మండలం కుమ్మరనత్తం పంచాయతీ కపాడమిట్టపల్లెకు చెందిన శివరాజ్ భార్య శిరీషా(35) కడుపునొప్పి తాళలేక బుధవారం పురుగులమందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. కుటుంబసభ్యులు గుర్తించి పుంగనూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

కన్నడ అనువాద పుస్తకం ఆవిష్కరణ



గుడుపల్లె, నవంబరు13 (ఆంధ్రజ్యోతి): ద్రావిడ విశ్వవిద్యాలయం కన్నడ శాఖాధ్యక్షురాలు ఆచార్య జయలలిత తమిళంలోని తొల్లప్పియం ఇళంపురనార్ అనే పుస్తకాన్ని కన్నడంలోకి అనువదించారు. ఈనెల 11వ తేదీన చెన్నైలో జరిగిన దక్షిణ భారత భాషల వర్క్‌షాపులో సెంట్రల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ క్లాసికల్ తమిళ్ డైరెక్టర్ డాక్టర్ చంద్రశేఖర్ జయలలిత అనువదించిన పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఆచార్య జయలలితను ద్రావిడ వర్సిటీ వీసీ ఆచార్య దొరస్వామి, రిజిస్ట్రార్ ఆచార్య కిరణ్ కుమార్, అధ్యాపకులు అభినందించారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆయా పోస్టులకు దరఖాస్తు చేసుకోండి

వి.కోట, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): వి.కోట మండల పరిధిలోని గాండ్లపల్లె, పాపేపల్లె అంగన్‌వాడీ కేంద్రాల్లో సహాయకురాలి పోస్టులకు అర్హులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని ఐసీడీఎస్ పీవో అరుణశ్రీ ఒక ప్రకటనలో కోరారు. పదవ తరగతి ఉత్తీర్ణులైన స్థానికులు ఈనెల 22వ తేది సాయంకాలం 5 గంటలలోపు ప్రాజెక్టు కార్యాలయంలో దరఖాస్తులు అందజేయాలని తెలిపారు.

ఇటుకలు పైనపడి వృద్ధురాలి మృతి



బైరెడ్డిపల్లె, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పాతపేటలో ఇటుకలు మీద పడి రాధమ్మ(63) మృతిచెందారు. బుధవారం ఇంటి నిర్మాణ పనులు జరుగుతున్న చోట ఇటుకలు పేర్చిపెడుతుండగా అవి ఒక్కసారిగా రాధమ్మపై పడడంతో తీవ్రంగా గాయపడింది. బాధితురాలిని చికిత్స నిమిత్తం పలమనేరు ఆస్పత్రికి తరలించగా అక్కడ చికిత్సపొందుతూ మృతిచెందారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఉపాధి పనులపై నిఘా : డ్వామా పీడీ



ఉపాధి సామాజిక తనిఖీ బహిరంగ సభ

వి.కోట,నవంబరు13(ఆంధ్రజ్యోతి): ఉపాధి పనులపై ప్రతిచోటా సమగ్ర నిఘా ఉంటుందని డ్వామా పీడీ రవికుమార్ అన్నారు. బుధవారం వి.కోట మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో ఉపాధి హామీ సామాజిక తనిఖీ బహిరంగ సభ నిర్వహించారు. మండల పరిధిలోని 18 గ్రామ పంచాయతీలలో 2634 పనులు చేపట్టారని, వాటికి రూ. 11.13 కోట్ల ఖర్చు పెట్టడం జరిగిందని ఎంపీడీవో ఈశ్వరన్ సభకు వివరించారు. ఈ పనులకు సంబంధించి నవంబరు 1 నుంచి 11వ తేదీ వరకు క్షేత్ర స్థాయిలో తనిఖీలు నిర్వహించి పనులపై నివేదికను అధికారులకు నివేదించారు. రైతులు తాము నాటుకుని చనిపోయిన మామిడి మొక్కలను తెలియజేసి వాటి స్థానంలో వేరే మొక్కలు నాటుకోవాలని ఆదేశించారు. అలాగే అదనంగా జరిగిన చెల్లింపులు రూ. 39,504 రికవరీకి ఆదేశించారు. ఏపీవో ఆశోకొరెడ్డి, ఏతఈ శ్రీనివాస్, ఎస్ఆర్‌పీ బుజ్జి, పంచాయతీ కార్యదర్శులు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

యాజమాన్య పద్ధతులు పాటిస్తే అధిక దిగుబడులు



మల్లేశ్వరపురంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం

సోమల, నవంబరు13 (ఆంధ్రజ్యోతి): రైతులు యాజమాన్య పద్ధతులు పాటిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చునని పుంగనూరు ఏడీఏ శివకుమార్ రాజు పేర్కొన్నారు. బుధవారం నంజంపేట, ఆవులపల్లె పంచాయతీల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరి, వేరుశనగ పంటలలో నాణ్యమైన అధిక దిగుబడులు సాధించడానికి పాటించాల్సిన మెళకువలను రైతులకు వివరించారు. రైతులకు కావాల్సిన వ్యవసాయ పరికరాలు, విత్తనాలకు నమోదు చేసుకున్నారు. వరి పంటలను పరిశీలించి తెగుళ్ళ నివారణ పద్ధతులను విశదీకరించారు. రైతు సేవా కేంద్రాల్లో పంటల వివరాలను తప్పక కుండా ఈకేవైసీ చేయించాలని తెలిపారు. ప్రస్తుతం వర్షాలు కురుస్తుండడంతో పంట కోతలు ఆపేయాలన్నారు. కార్యక్రమంలో ఏవో సుధాకర్, మాజీ సర్పంచు రెడ్డెమ్మ, రైతులు వేణుగోపాల్ నాయుడు, ప్రభాకర్ నాయుడు, రైతు సేవా కేంద్రం అధికారులు రాధిక, సుబ్రమణ్యం, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నేడు డయల్ యువర్ డీఎం

పలమనేరు, నవంబరు13(ఆంధ్రజ్యోతి): పలమనేరు ఆర్టీసీ డిపో పరిధిలోని ప్రయాణీకుల సమస్యలు పరిష్కరించి వారికి మెరుగైన సేవలు అందించేందుకు గాను ఈనెల 14వతేది గురువారం డయల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు డిపో మేనేజర్ టీకే. స్వామి తెలిపారు. గురువారం ఉదయం 11 గంటలనుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కావున పలమనేరు నియోజకవర్గంలోని ప్రయాణీకులు తమ సమస్యలను 9959225678 నంబరుకు డయల్ చేసి తెలియజేయాలన్నారు.

టీకాల తనిఖీ

గుడుపల్లె, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): గుడుపల్లె ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా వ్యాధి నిరోధక టీకాల అధికారి డాక్టర్ హనుమంతు రావు బుధవారం తనిఖీ చేశారు. టీకాల రిజిస్టర్, ఐఎల్ఆర్, ఫ్రిజ్‌లను పరిశీలించారు. ఆ తరువాత వైద్య అధికారులు, సిబ్బందితో సమావేశం నిర్వహించారు. టీకాల వాడకం గురించి తగిన సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో మాస్ మీడియా అధికారి జయరామ్, వైద్యాధికారిని డాక్టర్ డెల్విన్, సీహెచ్‌వో రాజు తదితరులు పాల్గొన్నారు.

ఆస్పత్రికి చెత్త బుట్టల వితరణ



పలమనేరు, నవంబరు13 (ఆంధ్రజ్యోతి) : పలమనేరు ప్రభుత్వ ఆసుపత్రికి పట్టణానికి చెందిన సంఘసేవకులు శ్రీపురం సీతారామయ్య బుధవారం 16 డస్టుబిన్స్ వితరణగా అందజేశారు. ఆసుపత్రి సూపరింటిండెంట్ మమతారాణికి వీటిని అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆర్ఎంఓ శారద, మాజీ కౌన్సిలర్ నరేంద్రబాబు పాల్గొన్నారు. ఆసుపత్రికి డస్టుబిన్స్ అందజేసిన శ్రీపురం సీతారామయ్యకు ఆసుపత్రి సూపరింటెండెంట్ మమతారాణి, ఆర్ఎంఓ శారద కృతజ్ఞతలు తెలియజేశారు.

మధ్యాహ్న భోజనం తనిఖీ

పలమనేరు, నవంబరు13 (ఆంధ్రజ్యోతి) : పలమనేరు ప్రభుత్వ ఉన్నతపాఠశాల, ఉర్దూ ఉన్నత పాఠశాలల్లో బుధవారం ఎంఈఓ లీలారాణి మధ్యాహ్న భోజన పథకాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులతోను, ఏజన్సీ మహిళలతో మాట్లాడుతూ మధ్యాహ్న భోజనం మెనూ మేరకు తయారు చేసి విద్యార్థులకు అందిచాలని సూచించారు. అనంతరం పలమనేరు సౌత్ ప్రాథమిక పాఠశాలను సందర్శించారు. విద్యార్థుల సామర్థ్యాలను, నైపుణ్యాలను పరీక్షించారు. ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బుద్ధిమాంద్యం పిల్లలకు వైద్య పరీక్షలు

కుప్పం, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): కుప్పంలోని విక్టరీ స్కూల్‌లో గల బుద్ధిమాంద్యం కలిగిన పిల్లలకు కుప్పం ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి అరీఫా షేక్ ఆధ్వర్యంలో బుధవారం ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ పిల్లలకు వినికిడి, ఎముకల పటుత్వం వంటి పరీక్షలను నిపుణులైన డాక్టర్లచే చేయించారు. ఈ పరీక్షలలో నిర్ధారణ అయిన జబ్బులకు వైద్యం అందే దిశగా చర్యలు చేపడుతామని ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి తెలిపారు. కుప్పం ఆసుపత్రి మెడికల్ సూపరింటెండెంటు డాక్టర్ ఎల్.వి జయలక్ష్మి, డాక్టర్ పి.విశ్వనాథ్, డాక్టర్ క్రాంతికుమార్, డాక్టర్ జీఎస్.సుధారమ్య, డాక్టర్ టి.రాజన్ లీలారెడ్డి, గుడుపల్లె ఎంఈవో కె.శ్రీదేవి పాల్గొన్నారు.

రేపు పలమనేరులో ఎల్ఐసీ కళాజాతా

పలమనేరు, నవంబరు13 : ఎల్ఐసీ కళాజాతా బృందం ఈనెల 15వ తేది పలమనేరుకు రానున్నట్లు ఎల్ఐసీ యూనియన్ నాయకులు గౌరీశంకర్‌రెడ్డి, ఎస్ఎస్ఎన్. మూర్తి, శ్రీకాంత్, ఖగేశ్ ఒక ప్రకటనలో తెలిపారు. 15వ తేది సాయంకాలం 5 గంటలకు చేరుకుని పాటలు, రూపకాలు, నృత్యాల ద్వారా వారు జీవిత బీమా సంస్థ ప్రయోజనాలను, ఆశయాలను ప్రజలకు వివరిస్తారన్నారు.

టీడీపీ సభ్యత్వంతో ప్రత్యేక గుర్తింపు

సోమల, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): టీడీపీలో సభ్యత్వంతో కార్యకర్తలకు ప్రత్యేక గుర్తింపు ఉంటుందని మాజీ వైస్ ఎంపీపీ ఉమాపతి నాయుడు పేర్కొన్నారు. బుధవారం పెద్దఉప్పరపల్లె, ఆవులపల్లె, అన్నెమ్మగారిపల్లె పంచాయతీల్లో సభ్యత్వ నమోదును పరిశీలించి యువతకు పలు సూచనలు చేశారు. గత ఎన్నికల్లో పార్టీ గెలుపుకోసం కృషి చేసిన ప్రతి ఒక్కరూ రూ. 100 చెల్లించి సభ్యత్వం పొందాలన్నారు. కార్యక్రమంలో బాలాజీ నాయుడు, వేణుగోపాల్ నాయుడు, రవి నాయుడు, రెడ్డెప్ప, రఫీ తదితరులు పాల్గొన్నారు.

వడ్డిపల్లెలో అయ్యప్ప భక్తుల పూజలు

సోమల,నవంబరు13(ఆంధ్రజ్యోతి):సోమల మండలం వడ్డిపల్లెలో అయ్యప్ప భక్తుల ఆధ్వర్యంలో కన్యపూజలు నిర్వహించారు. కొబ్బరి మొక్కలతో సుందరంగా అంబలాన్ని ఏర్పాటుచేసి విద్యుత్ దీపాలంకరణ చేశారు. అఖండజ్యోతులు వెలిగించి అయ్యప్పస్వామి, వినాయకస్వామి, సుబ్రమణ్యస్వామి చిత్రపటాలను ఏర్పాటు చేసి పూజలు చేశారు.

పన్నుల వసూలుపై కార్యదర్శులకు అవగాహన

పుంగనూరు రూరల్, నవంబరు13(ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీల్లో పన్నుల వసూలుపై కార్యదర్శులకు రాష్ట్ర పంచాయతీరాజ్‌శాఖ కమిషనర్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అవగాహన కల్పించారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆమె మాట్లాడుతూ పంచాయతీ పరిధిలోని ఇళ్ల పన్నులు, పరిశ్రమలు, దుకాణదారుల నుంచి పన్నులు ఎలా వసూలు చేయాలో సూచించారు. పంచాయతీ కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్లు తదితరులు పాల్గొన్నారు.

15న అగస్త్యేశ్వరస్వామి ఆలయంలో కార్తీక పౌర్ణమి పూజలు

పుంగనూరు, నవంబరు13(ఆంధ్రజ్యోతి): ఈనెల 15న అగస్త్యేశ్వరస్వామి ఆలయంలో కార్తీక పౌర్ణమి పూజలు నిర్వహించనున్నట్లు అర్చకులు ఎస్. షణ్ముఖ, ఎస్.రాజన్న తెలిపారు. కార్తీక పౌర్ణమి సందర్భంగా రుద్రాభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రతి సోమవారం అన్నదానం నిర్వహించనున్నట్లు తెలిపారు.

ముగిసిన భూ రీ సర్వే గ్రామసభలు

- పరిష్కారం కోసం రైతుల ఎదురుచూపులు



197 రామాపురంలో రైతులతో మాట్లాడుతున్న డీటీ రూపాదేవి

గుడిపాల, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వంలో భూ రీ సర్వే పేరిట చాలా మంది రైతులు తీవ్రంగా నష్టపోవడంతో కొత్త ప్రభుత్వం మండలంలో నిర్వహించిన గ్రామ సభలు బుధవారంతో ముగిశాయి. తహసీల్దార్ చంద్రశేఖర్‌రెడ్డి అధ్యక్షతన గ్రామ సభలు నిర్వహించి భూములు కోల్పోయిన రైతుల జాబితాను తయారు చేశారు. మండలంలో సుమారు 800 మంది రైతులకు సంబంధించి భూములు తక్కువగా నమోదు చేయడం లేదా ఎక్కువగా చేయడం వంటివి జరిగాయి. పాసుబుక్కు ఉన్నప్పటికీ సర్వే నెంబర్లను నమోదు చేయకపోవడం, వన్-బీలో రాకపోవడంతో రైతులు బ్యాంకుల వద్ద రుణాల కోసం ప్రదక్షిణలు చేస్తున్నారు. ఇప్పటికైనా రెవెన్యూ అధికారులు స్పందించి తమకు న్యాయం చేయాలని బాధితులు రైతులు కోరుతున్నారు.

ప్రకృతి వ్యవసాయ పద్ధతులతో అధిక దిగుబడి



పొలం పిలుస్తోంది కార్యక్రమంలో పాల్గొన్న మురళీకృష్ణ, అధికారులు

యాదమరి, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): సహజ ఎరువుల వాడకం, ప్రకృతి వ్యవసాయ పద్ధతులతో అధిక దిగుబడి సాధించవచ్చని జిల్లా వ్యవసాయ అధికారి మురళీకృష్ణ అన్నారు. కోణాపల్లిలో బుధవారం జరిగిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ భూసార పరీక్షల ఫలితాలను అనుసరించి సమతుల ప్రకృతి ఎరువుల వాడకం వల్ల భూసారం పెరిగి ఎరువులకు పెట్టే అధిక ఖర్చులను నివారించవచ్చన్నారు. నానో ఎరువుల గురించి, 2024-25 రబీ సీజన్‌లో పంట బీమా పథకాలపై రైతులకు అవగాహన కల్పించారు. అనంతరం స్థానిక రైతు నాగమణికి చెందిన కందిపంటను పరిశీలించి, కాయతొలుచు పురుగు రాకుండా సస్యరక్షణ చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల ఏవో చరిత, ఎంపీటీసీ శైలజ, వీరన్, కర్ణదాస్, హరికృష్ణమనాయుడు, కెకె రాధ, రైతులు పాల్గొన్నారు.

అవార్డు గ్రహీతకు సన్మానం



సురేంద్రబాబును సన్మానిస్తున్న తోటి ఉపాధ్యాయులు

ఐరాల(కాణిపాకం), నవంబరు 13(ఆంధ్రజ్యోతి): కాణిపాకం జడ్పీ హైస్కూల్‌లో పని చేస్తున్న బి.సురేంద్రబాబు రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎంపిక కావడం ఆనందదాయకమని ఇన్‌చార్జి హెచ్‌ఎం సురేష్‌బాబు అన్నారు. పాఠశాలలో బుధవారం ఏర్పాటు చేసిన అభినందన సభలో హెచ్‌ఎం మాట్లాడుతూ 2024-25 విద్యా సంవత్సరానికి సురేంద్రబాబును రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయుడిగా ప్రభుత్వం ఎంపిక చేసిందన్నారు. అనంతరం ఆయన్ను ఉపాధ్యాయులు శాలువాకప్పి సన్మానించారు. సురేంద్రబాబు మాట్లాడుతూ తనకు ఈ అవార్డు రావడానికి సహకరించిన సహచర ఉపాధ్యాయులకు కృతజ్ఞతలు తెలియజేశారు. యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు సోమశేఖర్ నాయుడు, శాంతాదేవి, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాల అమలే లక్ష్యంగా బడ్జెట్

- ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్

నగరి, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం బడ్జెట్‌ను ప్రవేశపెట్టిందని నగరి ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గత ప్రభుత్వ వైఫల్యాలతో అస్తవ్యస్తంగా తయారైన వ్యవస్థలను గాడిలో పెడుతూ ప్రజాసమస్యల పరిష్కారానికి కూటమి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందన్నారు. నిరుపేదల అభివృద్ధే ధ్యేయంగా బడ్జెట్‌లో విద్య, వైద్యరంగానికి పెద్దపీట వేసినట్లు చెప్పారు. విద్యావ్యవస్థలో నూతన మార్పులు తీసుకువచ్చేలా కూటమి ప్రభుత్వం విద్యారంగానికి అధిక ప్రాధాన్యతనిస్తూ 30వేల కోట్ల రూపాయలను కేటాయించిందన్నారు. ప్రజారంజక బడ్జెట్‌ను ప్రవేశపెట్టిన ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్, ఆర్థికమంత్రి పయ్యావుల కేశవ్‌కు హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు.

రైతు సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యం



వేరుశనగ కాయలు పంపిణీ చేస్తున్న కూటమి నాయకులు

నింద్ర, నవంబర్ 13(ఆంధ్రజ్యోతి): రైతు సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని మండల టీడీపీ అధ్యక్షుడు వెంకటేశ్వరరావు అన్నారు. బుధవారం నింద్రలో వేరుశనగ కాయల పంపిణీ కార్యక్రమం జరిగింది. ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రైతుల కోసం వేరుశనగ కాయలు, పెసలు, ఉద్దులు, ఎరువులు వంటివి అందిస్తున్నామని చెప్పారు. రైతులు వీటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయాధికారి తులసిరామ్, నాయకులు రవి నాయుడు, తంగరాజ్, సంపూర్ణమ్మ, రాధ, రవికుమార్, గాలి రమేష్ నాయుడు, పెరుమాల్‌రెడ్డి, భాస్కర్, దొరస్వామి నాయుడు, కోటేశ్వరరావు, పరదేశి తదితరులు పాల్గొన్నారు.

16న సామాజిక తనిఖీ బహిరంగ సభ

పూతలపట్టు, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): ఈనెల 16వ తేదీన గ్రామీణ ఉపాధి హామీ పనులపై సామాజిక తనిఖీ బహిరంగ సభ నిర్వహించనున్నట్లు ఎంపీడీవో నాగరాజు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ బహిరంగ సభకు ప్రజాప్రతినిధులు, సర్పంచులు, ఎంపీటీసీలు, ఫీల్డ్ అసిస్టెంట్లు తప్పక హాజరుకావాలని కోరారు.

సీఎం చంద్రబాబుకు కృతజ్ఞతలు



చంద్రబాబును సత్కరిస్తున్న థామస్

వెదురుకుప్పం, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబును బుధవారం అమరావతిలో గంగాధర నెల్లూరు ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ డాక్టర్ థామస్ కలిశారు. తనపై నమ్మకంతో రాష్ట్ర ప్రభుత్వం విప్‌గా అవకాశం కల్పించడంతో మర్యాదపూర్వకంగా కలసి కృతజ్ఞతలు తెలిపారు. చంద్రబాబు నిర్వహించిన సమావేశంలో విప్ బృందంతో సహా థామస్ కూడా హాజరయ్యారు.

మినీ అంగన్వాడీలను మెయిన్ కేంద్రాలుగా మార్చాలి

వెదురుకుప్పం, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): మినీ అంగన్వాడీలను మెయిన్ కేంద్రాలుగా మార్చాలని ఈ నెల 16వ తేదీన కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహిస్తున్నట్లు కార్వేటినగరం సీడీపీవో పద్మసునందకు బుధవారం సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు వాడ గంగరాజు అర్జీమేటం ఇచ్చారు. అంగన్వాడీలకు ఇచ్చిన మాట ప్రకారం హామీని ప్రభుత్వం నెరవేర్చాలని కోరారు. 16వ తేదీన జరిగే ధర్నాను విజయవంతం చేయాలని ఆయన కోరారు. ప్రాజెక్టు అధ్యక్షురాలు విజయ, కార్యదర్శి మమత తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి గ్రంథాలయ వారోత్సవాలు

పూతలపట్టు, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): పూతలపట్టులో గ్రంథాలయంలో గురువారం నుంచి గ్రంథాలయ వారోత్సవాలు నిర్వహించనున్నట్లు కార్యాలయ అధికారి రవీంద్రబాబు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ వారోత్సవాలు గురువారం నుంచి వారం రోజుల పాటు నిర్వహించనున్నట్లు ఆయన పేర్కొన్నారు.

కలెక్టర్ మందలించినా మారని డాక్టర్ల తీరు

- మధ్యాహ్నంనుంచే వెళ్లిపోతున్న ప్రభుత్వాస్పత్రి వైద్యులు
- ఆర్‌ఎంపీల దగ్గరకు క్యూ కడుతున్న రోగులు



డాక్టర్లు లేకపోవడంతో ఖాళీగా ఉన్న కుర్చీలు

పెనుమూరు, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): కలెక్టర్ మందలించినా పెనుమూరు 50 పడకల ప్రభుత్వాస్పత్రి డాక్టర్ల తీరు మారడం లేదని రోగులు ఆరోపిస్తున్నారు. పెనుమూరు 50 పడకల ప్రభుత్వాస్పత్రిపై ప్రజల నుంచి ఫిర్యాదులు అధికంగా రావడంతో కలెక్టర్ సుమిత్‌కుమార్ గత నెల 25వ తేదీన ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించి, రాత్రిపూట డాక్టర్లు ఉండటం లేదనే ఫిర్యాదులు వస్తున్నాయని, ప్రతి రోజూ రాత్రిపూట డాక్టర్లు అందుబాటులో ఉండాలని సూచించారు. ఆయన వచ్చి వెళ్లిన వారం రోజులు డాక్టర్లు, సిబ్బంది సక్రమంగా అందుబాటులో ఉన్నారు. ఆ తరువాత డాక్టర్ల తీరు యథావిధిగా మారింది. మధ్యాహ్నం 3 గంటలకే డ్యూటీ డాక్టర్లు ఇంటికి వెళ్లిపోతున్నారు. ఒక్క డాక్టరు మాత్రమే ఆస్పత్రిలో అందుబాటులో ఉంటున్నారు. ఇక్కడ ఓపీలు రోజుకు 250పైనే నమోదవుతున్నాయి. డాక్టర్లు అందుబాటులో లేకపోవడంతో అత్యవసరమైతే రోగులు చిత్తూరు, తిరుపతికి వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. రాత్రిపూట కచ్చితంగా ఒక డాక్టర్‌కు డ్యూటీ కేటాయించాలని కలెక్టర్ సూచించినా సోమవారం రాత్రి డాక్టర్లు లేరని వైద్యం కోసం వెళ్లిన రోగులు తెలిపారు. ప్రభుత్వాస్పత్రిలో డాక్టర్లు అందుబాటులో లేకపోవడంతో పెనుమూరులో ఉన్న నలుగురు ఆర్‌ఎంపీ డాక్టర్ల వద్ద రోగులు నిరంతరం వైద్యం చేయించుకుంటున్నారు. ప్రస్తుతం జ్వరాలు ప్రబలుతున్న నేపథ్యంలో ఆరోగ్య కేంద్రంలో డాక్టర్లు అందుబాటులో ఉండాలని ప్రజలు కోరుతున్నారు.

కీళపట్టు శివార్లలోని క్వారీలను రద్దు చేయాలి



రోడ్డుపై ధర్నా చేస్తున్న యువత

నగరి, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): నగరి మున్సిపాలిటీ పరిధిలోని కీళపట్టు శివార్లలో వున్న క్వారీలను రద్దు చేసి కొండలను కాపాడాలని యువత డిమాండ్ చేశారు. కొండ పరిసర ప్రాంతాలకు చెందిన యువకులు బుధవారం కీళపట్టు వద్ద జాతీయ రహదారిపై బైఠాయించి నిరసన తెలిపారు. రోడ్డుపై బైఠాయించడంతో ట్రాఫిక్ స్తంభించడంతో పోలీసులు నిరసనకారులను రోడ్డుపై నుంచి లేపేశారు. అనంతరం కీళపట్టు జాతీయ రహదారి నుంచి ఆర్డీవో కార్యాలయం వరకు ర్యాలీగా వచ్చి తమకు న్యాయం చేయాలంటూ నినాదాలు చేశారు. ఆర్డీవో అందుబాటులో లేకపోవడంతో సిబ్బందికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కొండలపై బాంబులు పేలితే పశువులు ఎలా మేతకు వెళతాయని ప్రశ్నించారు. క్వారీలను ఆపి అడవులకు రక్షణ కల్పించాలన్నారు.

క్రైం కార్నర్

ఆర్థిక ఇబ్బందులతో రైతు ఆత్మహత్య

ఐరాల, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): ఆర్థిక ఇబ్బందులతో రైతు ఆత్మహత్య చేసుకున్న చేసుకున్న సంఘటన ఐరాల మండలం తాళంబేడువారిపల్లెలో బుధవారం జరిగింది. ఐరాల ఎస్‌ఐ నరసింహులు కథనం మేరకు.. తాళంబేడువారిపల్లెకు చెందిన సుధాకర్(31) వ్యవసాయ పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నారు. ఆయనకు ఇద్దరు భార్యలు. మొదటి భార్య చంద్ర యాదమరి మండలం మోర్దానపల్లెలో నివాసం ఉంది. ఆమెకు ఇద్దరు కుమారులు ఉన్నారు. రెండవ భార్య లక్ష్మీదుర్గాను సుధాకర్ తొమ్మిది సంవత్సరాల క్రితం వివాహం చేసుకున్నాడు. ఈమెకు ఇద్దరు కుమార్తెలు. రెండు కుటుంబాలను పోషించలేక తరచూ చనిపోతానని చెబుతుండేవాడు. ఈ క్రమంలో సుధాకర్ మంగళవారం పురుగు మందు సేవించి రెండవ భార్య లక్ష్మీదుర్గా వద్దకు వచ్చి కుప్పకూలి పోయాడు. ఆమె బంధువుల సహాయంతో చిత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలించగా, చికిత్స పొందుతూ బుధవారం సుధాకర్ మృతి చెందారు. రెండవ భార్య ఫిర్యాదు మేరకు ఐరాల పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పి.కొత్తకోటలో చోరీ



చోరీ జరిగిన దుకాణాలు

పూతలపట్టు, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పి.కొత్తకోటలోని ఓ ప్రొవిజనల్ స్టోర్‌లో గుర్తుతెలియని వ్యక్తులు మంగళవారం అర్ధరాత్రి చోరీకి పాల్పడ్డారు. కూటమివారిపల్లె గ్రామానికిచెందిన వాసు పి.కొత్తకోట గ్రామంలో ప్రొవిజనల్ స్టోర్ నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఆయన మంగళవారం రాత్రి యథావిధిగా స్టోర్‌ను మూసేసి ఇంటికి వెళ్లగా.. అర్ధరాత్రి దాటాక గుర్తుతెలియని వ్యక్తులు స్టోర్ షట్టర్‌ను పగులగొట్టి దుకాణంలో వున్న రూ.30 వేల నగదును చోరీచేశారు. అలాగే పక్కనే ఉన్న లక్ష్మీపతిరెడ్డికి చెందిన సప్లయర్స్ షాపు షట్టర్‌ను పగులకొట్టేందుకు ప్రయత్నించగా, తాళాలు రాకపోవడంతో వెళ్లిపోయారు. దీంతో బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

సారా విక్రయిస్తున్న మహిళ అరెస్టు

చిత్తూరు సిటీ, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): సారావిక్రయిస్తున్న మహిళను అరెస్టు చేసినట్లు ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ సత్యనారాయణ చెప్పారు. బుధవారం గుడిపాల మండలం నంగమంగళంలో తనిఖీలు నిర్వహించి ఓ మహిళవద్ద 67 సారా ప్యాకెట్లు గుర్తించి, అదుపులోకితీసుకున్నామని చెప్పారు.

థామస్‌కు విప్ ఇవ్వడంపై హర్షం

పెనుమూరు, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): గంగాధరనెల్లూరు ఎమ్మెల్యే డాక్టర్ థామస్‌కు ప్రభుత్వ విప్ పదవి ఇవ్వడంపై టీడీపీ మండల అధ్యక్షులు రుద్రయ్య నాయుడు, ప్రధానకార్యదర్శి భాస్కర్ బుధవారం హర్షం వ్యక్తం చేశారు. విప్ పదవి కట్టబెట్టడంతో క్యాడర్ సంతోషం వ్యక్తం చేస్తుందని అన్నారు.

ఇష్టపడి చదవాలి

శ్రీరంగరాజపురం, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): ప్రతి విద్యార్థి కష్టపడి కాకుండా ఇష్టపడి చదవాలని ఎస్‌ఆర్‌పురం ఎస్‌ఐ సుమన్ అన్నారు. బుధవారం రాత్రి 49.కొత్తపల్లెమిట్ట ఎస్సీ బాలుర వసతి గృహాన్ని పరిశీలించి, విద్యార్థుల సమస్యల గురించి అడిగి తెలుసుకున్నారు. ప్రతి విద్యార్థి ఉన్నత చదువులు చదవాలని సూచించారు. హాస్టల్ కుక్ జయపాల్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

సమష్టిగా పనిచేయండి : కలెక్టర్



మాట్లాడుతున్న కలెక్టర్ సుమిత్ కుమార్

చిత్తూరు సెంట్రల్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): అంగన్వాడీ, ఆశా వర్కర్లు, ఏఎన్‌ఎంలు సమష్టిగా పనిచేయాలని కలెక్టర్ సుమిత్ కుమార్ సూచించారు. అంగన్వాడీ సూపర్వైజర్లు క్షేత్ర స్థాయి పర్యటనలో భాగంగా అంగన్వాడీ కేంద్రాలతో పాటు వారి పరిధిలోని గర్భిణుల ఆరోగ్య స్థితిగతులపై బుధవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో సీడీపీవో, సూపర్‌వైజర్లతో సమీక్షా సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ వైద్య ఆరోగ్యశాఖ, ఐసీడీఎస్ శాఖలు క్షేత్ర స్థాయిలో సమన్వయంతో పనిచేయడం ద్వారా గర్భిణుల ఆరోగ్య సంరక్షణతో పాటు మాతాశిశు మరణాల నివారణ సులభతరమవుతుందన్నారు. బాల్యవివాహాలు, టీనేజ్ ప్రెగ్నెన్సీలకు సంబంధించి తల్లిదండ్రులకు క్షేత్ర స్థాయిలో అవగాహన కల్పించాలన్నారు. జిల్లాలో 12 ఐసీడీఎస్ ప్రాజెక్టుల ద్వారా 2420 మెయిన్, మినీ అంగన్వాడీ కేంద్రాల్లో ఏడు నెలల నుంచి మూడేళ్ల వరకు 55,575 మంది చిన్నారులు, 3-6 సంవత్సరాల్లో 35,799 పిల్లలు, 11,282 మంది గర్భిణులకు పౌష్టికాహారం అందిస్తున్నారని తెలిపారు. జేసీ విద్యాధరి, ట్రైనీ కలెక్టర్ హిమవంశీ, డీఎంహెచ్‌ఓ డాక్టర్ ప్రభావతి దేవి, జిల్లా సంక్షేమ శాఖ అధికారిణి హైమావతి, సీడీపీవోలు, సూపర్వైజర్లు పాల్గొన్నారు.

మంగళవిద్యావాణి 30వ సంచిక ఆవిష్కరణ



బంగారుపాళ్యం, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): స్థానిక మంగళపల్లి ఉన్నత పాఠశాలలో 'మంగళవిద్యావాణి' పాఠశాల 30వ సంచికను ప్రధానోపాధ్యాయులు రాజ్యలక్ష్మి అధ్యక్షతన ఆవిష్కరించారు. నలగాంపల్లెకు చెందిన పారిశ్రామికవేత్త ధరణిప్రసాద్, మధుసూదన్ సంచిక ముద్రణకు దాతలుగా వ్యవహరించారు. సంపాదకులుగా వ్యవహరిస్తున్న పాఠశాల పూర్వ ప్రధానోపాధ్యాయులు ఏపీ లలిత, గణిత ఉపాధ్యాయుడు అరుణశివప్రసాద్, విశ్రాంత ఉపాధ్యాయుడు అమరనాథ రెడ్డి, ఉపాధ్యాయులు రమాదేవి, సంజీవి, పిళ్లారప్ప, భారతి తదితరులు పాల్గొన్నారు.

కొత్తపద్ధతులు పాటిస్తే అధిక దిగుబడులు

పాలసముద్రం, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): రైతులు చెరకు పంటలో అధిక దిగుబడులు సాధించాలంటే కొత్తపద్ధతులను పాటించాలని ఎస్‌ఎన్‌జే షుగర్ ఫ్యాక్టరీ కేన్ అడ్వైజర్ కృష్ణన్ సూచించారు. బుధవారం పాలసముద్రం మండలంలోని శ్రీబొమ్మరాజపురంలో చెరకు రైతులకు అవగాహన సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ చెరకు సాగు చేసే సమయంలో సాలు సాలుకు మధ్య నాలుగున్నర అడుగుల దూరంలో చెరకు విత్తనం నాటాలన్నారు. సాగునీరు ఆదా చేయడానికి డ్రిప్ పద్ధతిలో సాగుచేయాలన్నారు. ప్రస్తుతం మూడు కొత్త వంగడాలు అధిక దిగుబడిని ఇస్తున్నాయని, వాటిని రైతులు సాగు చేయాలన్నారు. తాము చెప్పిన పద్ధతుల్లో పాటిస్తే ఎకరానికి రూ.10వేలు, సాధారణ పద్ధతిలో సాగుచేస్తే రూ.5వేలు ఫ్యాక్టరీ ఇస్తుందన్నారు. కేన్ మేనేజరు చంద్రయ్య, హెచ్‌వీడీ వరదరాజన్, ఏవో చిరంజీవి, ఫీల్డ్‌మెన్‌లు వెంకటేశులు, కేశవులు, సతీష్, రైతులు పాల్గొన్నారు.

విద్యుత్ శాఖ గ్రీవెన్స్‌డేకు 3 ఫిర్యాదులు

చిత్తూరు రూరల్, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): స్థానిక గాంధీరోడ్డులోని విద్యుత్ శాఖ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన గ్రీవెన్స్ డేకు 3 ఫిర్యాదులు వచ్చినట్లు ఈఈ మునిచంద్ర తెలిపారు. ఆయన మాట్లాడుతూ విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కారం కోసం ప్రత్యేక గ్రీవెన్స్‌డే నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రైతులు, వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. గ్రీవెన్స్ డేలో 3 అర్జీలు వస్తే అప్పటికప్పుడే 2 అర్జీలు పరిష్కారమైనట్లు తెలిపారు. గీవెన్స్ డేలో వచ్చే అర్జీలను పరిశీలించి సత్వరమే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు.

డీఎంపురంలో క్రీడా పోటీలు



క్రీడా పోటీల్లో విద్యార్థులు

వెదురుకుప్పం, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): కార్వేటినగరం మండలం డీఎంపురం జడ్పీ ఉన్నత పాఠశాలలో బుధవారం క్రీడా పోటీలను హెచ్‌ఎం కేశవులు, వ్యాయామ సంచాలకులు తిరుమలరాజు ప్రారంభించారు. కబడ్డీ, క్రికెట్, త్రోబాల్, సాఫ్ట్‌బాల్, హ్యాండ్‌బాల్, పరుగు పందెం, వ్యాసరచన, వక్తృత్వ పోటీలను నిర్వహించారు.

16న ఉచిత ఆయుర్వేద వైద్యశిబిరం

పూతలపట్టు, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): పూతలపట్టు ఉన్నత పాఠశాల ఆవరణలో ఈనెల 16న శ్రీనివాస ఎడ్యుకేషనల్ అకాడమి ఆధ్వర్యంలో ఉచిత ఆయుర్వేద వైద్యశిబిరం నిర్వహించనున్నట్లు శ్రీవేంకటేశ్వర ఇంజనీరింగ్ కళాశాల వైస్‌చైర్మన్ రావూరి శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. శనివారం ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు జరిగే ఈవైద్య శిబిరాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

మామిడిలో ఫ్రూట్ కవరు వాడకంతో నాణ్యమైన పంట దిగుబడి

తవణంపల్లె, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): మామిడి పంటకు ఫ్రూట్ కవరు వాడకంతో నాణ్యమైన అధిక పంట దిగుబడి సాధించవచ్చునని ఏవో ప్రవీణ్ తెలిపారు. బుధవారం మండలంలోని కట్టకిందపల్లెలో పొలం బడి కార్యక్రమం నిర్వహించారు. ఏవో మాట్లాడుతూ మామిడి సాగులో సరైన నూతన యాజమాన్య పద్ధతులతో నాణ్యమైన అధిక దిగుబడి సాధించవచ్చునన్నారు. పంట సాగులో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, సస్యరక్షణ తదితర వాటిపై రైతులకు అవగాహన కల్పించారు. ఫ్రూట్ కవర్లను ప్రభుత్వం రాయితీపై అందిస్తుందని, రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో రైతులు, వ్యవసాయశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

వెస్ట్రన్ వోకల్ సోలోలో ఎన్‌పీఎస్ విద్యార్థిని ప్రతిభ



విద్యార్థినిని అభినందిస్తున్న అధ్యాపకులు

చిత్తూరు సెంట్రల్, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): తిరుపతి ఎస్వీయూలో నిర్వహించిన వెస్ట్రన్ వోకల్ సోలో పోటీల్లో స్థానిక ఎన్‌పీ సావిత్రమ్మ మహిళా డిగ్రీ కళాశాలలోని ద్వితీయ సంవత్సరం విద్యార్థిని కుమారి ప్రతిభ కనపరచి ప్రథమ బహుమతి సాధించింది. విద్యార్థినిని కళాశాల ప్రిన్సిపాల్ మనోహర్, అధ్యాపకులు అభినందించారు.

యూపీహెచ్‌సీల్లో డీఎంహెచ్‌వో తనిఖీలు



రోగులతో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో

చిత్తూరు రూరల్, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): నగరంలోని సత్యనారాయణపురం, టెలిఫోన్ కాలనీ యూపీహెచ్‌సీలను డీఎంహెచ్‌వో ప్రభావతి దేవి బుధవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆస్పత్రికి వచ్చిన రోగులతో మాట్లాడి వైద్య సేవలపై అడిగి తెలుసుకున్నారు. వైద్యాధికారులు, సిబ్బంది సమయపాలన తప్పక పాటించాలని ఆదేశించారు. పిల్లలకు ప్రాణాంతక రోగాలు రాకుండా రోగనిరోధక టీకాలు వేయించాలని సూచించారు. గురువారం నుంచి ఇంటింటి క్యాన్సర్ స్క్రీనింగ్‌ను సద్వినియోగం చేసుకోవాలని రోగులకు సూచించారు.

మదనపల్లె ఎక్సైజ్ డిపోలో పాత పరికరాలు, వస్తువుల వేలం

చిత్తూరు సిటీ, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): మదనపల్లె ఎక్సైజ్ డిపో పరిధిలోని పాత పరికరాలు, వస్తువులను వేలం వేయనున్నట్లు డిపో మేనేజర్ వి.శ్రీనివాసులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. గతంలో ప్రభుత్వ మద్యం దుకాణాల్లో వినియోగించిన 65 ఫ్రీజర్లు, 67 ఇన్వర్టర్లు, బ్యాటరీలు, 108 క్యాష్ కౌంటింగ్ మిషన్లు, 240 స్కానర్లు వేలం వేయనున్నట్లు పేర్కొన్నారు. ఈనెల 19వ తేది ఉదయం 10 గంటలకు మదనపల్లె ఎక్సైజ్ డిపోలో వేలం వేస్తారని తెలిపారు. ఆసక్తి గలవారు ముందుగా రూ.5000 చెల్లించి వేలంలో పాల్గొనాలని తెలిపారు. వివరాలకు 97017 77938, 86394 94220, 98661 44462 నెంబర్లను సంప్రదించాలని ఆ ప్రకటనలో తెలిపారు.

సంక్షిప్తంగా..

భక్తి ప్రపత్తులతో ఘన త్రయోదశి పూజలు

చిత్తూరు కల్చరల్, నవంబరు13(ఆంధ్రజ్యోతి): నగరంలోని శివాలయాల్లో బుధవారం ఘన త్రయోదశి పూజలను భక్తులు భక్తి ప్రపత్తులతో నిర్వహించారు. శివపార్వతులకు రుద్రాభిషేకాలు, హోమాలు నిర్వహించగా, విశేషఅలంకారాల్లో ఉన్న స్వామి అమ్మవార్లను భక్తులు దర్శించుకున్నారు. గిరింపేట శివగామి సుందరి సమేత చిదంబరేశ్వర, కామాక్షి అంబికా సమేత అగస్తీశ్వర, కాశీ విశ్వేశ్వర(రాజుగుడి), కట్టమంచి కులందేశ్వర, సంతపేట కనకదుర్గా, ఇరువారం నాగేంద్రస్వామి ఆలయాల్లో పూజల్లో భక్తులు పాల్గొన్నారు.

రేపు కార్తీక దీపోత్సవాలు

కార్తీక పౌర్ణమి సందర్భంగా శుక్రవారం నగరంలోని గిరింపేట చెంగల్ రాయకొండ, గంగనపల్లె బోడికొండ, గొడుగుమూరు వీవీకేఎస్ పర్వతం, ఎస్టేట్ జ్యోతీశ్వర కొండ, ప్రశాంత్‌నగర్ అయ్యప్పస్వామి కొండ తదితర ప్రాంతాల్లో భక్తులు కార్తీక దీపోత్సవాలు నిర్వహించనున్నారు.

సాగునీటి సంఘాలకు 23న ఎన్నికలు

వెదురుకుప్పం, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): మండలంలోని 9 సాగునీటి సంఘాలకు ఈ నెల 23వ తేదీన ఎన్నికలు జరుగుతాయని తహసీల్దార్ అరుణకుమారి బుధవారం తెలిపారు. వనదుర్గాపురం పంచాయతీలో రెండు, పాలసముద్రం పంచాయతీలో మూడు, వెంగళరాజకుప్పం పంచాయతీలో ఒకటి, శ్రీకావేరిరాజపురంలో రెండు, నరసింహాపురం పంచాయతీలో ఒక చెరువుకు ఎన్నికలు జరుగుతాయని వివరించారు. ఓటర్ల జాబితాలు సంబంధిత గ్రామసచివాలయాల్లో అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ఓటర్ల జాబితాలో ఏదైనా అభ్యంతరాలు ఉంటే తమ దృష్టికి తీసుకొస్తే సరిచేస్తామని, రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.